
నామినేటెడ్ పదవులు ఎవరికి?

తుడ, టీటీడీ బోర్డు మెంబరు పదవులపై పెరుగుతున్న ఆశలు

నామినేటెడ్ పదవులకు సంబంధించిన 60:40 ఫార్ములా తిరుపతిలో కూటమి నేతలను కలవరపరుస్తోంది. ఈ ఫార్ములా వల్ల నియోజకవర్గంలో బలంగా ఉన్న టీడీపీ నాయకులు తమకు నష్టం జరుగుతుందని ఆందోళన చెందుతున్నారు. జనసేన నేతల్లో సంబరం ఉన్నా తమలో పదవులు దక్కేది ఎవరికనే కలవరం వారిలోనూ ఉంది. బీజేపీ కూడా తమ వాటా పంచుకోవడానికి సిద్ధంగా ఉంది. పరిమిత సంఖ్యలో ఉన్న నామినేటెడ్ పదవుల పందేరం మొత్తంమీద తిరుపతి నియోజకవర్గంలో కత్తిమీద సాముగా మారే అవకాశం కనిపిస్తోంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



టీడీపీ నేతల్లో ఆందోళన

తిరుపతి నియోజకవర్గంలో జనసేన, బీజేపీతో పోలిస్తే టీడీపీకి బలమైన పార్టీ కేడర్‌తో పాటూ చెప్పుకోదగిన నాయకత్వం వుంది. దీంతో నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న వారూ ఆ పార్టీలో ఎక్కువే. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, జిల్లా పార్టీ అధ్యక్షుడు నరసింహ యాదవ్ మొదలుకుని రాష్ట్ర మీడియా కో ఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, రాష్ట్ర అధికార ప్రతినిధి కోడూరు బాలసుబ్రమణ్యం, ముఖ్య నాయకులు మబ్బు దేవనారాయణరెడ్డి, ఊకా విజయ్‌కుమార్, ఆర్సీ మునికృష్ణ, జేబీ శ్రీనివాస్, పులిగోరు మురళీకృష్ణారెడ్డి, పుష్పావతి వంటి వారున్నారు. తిరుపతి సీటు టీడీపీదని, తమ త్యాగం వల్లే మిత్రపక్షమైన జనసేనకు కేటాయించారన్న బలమైన అభిప్రాయం వీరిలో వ్యక్తమవుతోంది. ఇందుకు ప్రతిగా ప్రాముఖ్యత కలిగిన నామినేటెడ్ పదవులు ఇవ్వాలని వారు ఆశపడుతున్నారు. అయితే కూటమి పార్టీల ఫార్ములా ప్రకారం ఇక్కడ 60 శాతం పదవులు జనసేనకూ, మిగిలిన 40 శాతం పదవులు టీడీపీ, బీజేపీలకు కేటాయించేట్లయితే తమ పరిస్థితి ఏమిటా అని టీడీపీ ఆశావహులు డీలా పడిపోతున్నారు.

తిరుపతిలో ఉన్న పదవులు ఇవే!

తిరుపతి నియోజకవర్గంలో వున్న నామినేటెడ్ పదవులు చాలా పరిమితం. తుడా ఛైర్మన్, స్మార్ట్ సిటీ కార్పొరేషన్ ఛైర్మన్, టీటీడీ బోర్డు మెంబరు పదవులు మాత్రమే వున్నాయి. టీటీడీ బోర్డులో తుడ ఛైర్మన్ ఎక్స్‌అఫిషియో మెంబరుగా ఉంటారు కాబట్టి మహా అయితే మరొకరికి మాత్రమే అవకాశం ఉంటుంది. ఇతర నియోజకవర్గాల తరహాలో ఇక్కడ మార్కెట్ కమిటీలు లేవు. తాతయ్యగుంట గంగమ్మ ఆలయం మినహా ప్రాధాన్యత కలిగిన దేవదాయ శాఖ ఆలయాలూ లేవు. గంగమ్మ గుడి ట్రస్టు బోర్డు పదవి ద్వితీయ శ్రేణి నేతలకు కేటాయించే పదవి. ఈ నాలుగు పదవులనూ పరిగణనలోకి తీసుకున్నా 60 శాతం అంటే రెండు లేదా మూడు పదవులు జనసేన పార్టీకే దక్కుతాయి. ఇక ఒకటి లేదా రెండు పదవుల్ని బీజేపీతో కలసి టీడీపీ పంచుకోవాల్సి వుంటుంది. టీడీపీకి దక్కితే ఒక పదవి లేదంటే అది కూడా లేదు. తిరుపతి టీడీపీ వర్గీయులను ఈ చేదు వాస్తవం ఇబ్బంది పెడుతోంది.

స్టేట్ కోటాపై ఆశలు

అయితే తిరుపతి టీడీపీలో పలువురు ముఖ్య నాయకుల వాదన భిన్నంగా ఉంది. సుగుణమ్మ, నరసింహ యాదవ్, కోడూరు బాలసుబ్రమణ్యం, శ్రీధర్ వర్మ వంటి వారు తమకు పార్టీ స్టేట్ కోటాలో నామినేటెడ్ పదవులు కేటాయిస్తుందని ఆశిస్తున్నారు. సుగుణమ్మ, నరసింహ యాదవ్‌లకు తిరుపతిలో పదవులు కేటాయించలేని పక్షంలో ఎమ్మెల్సీ లేదా రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవులు ఇచ్చే అవకాశముంది.నారా లోకేశ్ సిఫారసు దక్కుతుందనే ఆశతో కోడూరు బాలసుబ్రమణ్యం ఉండగా, ఎన్టీయార్ కుటుంబసభ్యులను నమ్ముకుని శ్రీధర్ వర్మ వున్నారు. సున్నితమైన ఈ వ్యవహారాన్ని అధిష్ఠానం ఎలా అధిగమిస్తుందో వేచి చూడాల్సి వుంది.

జనసేనలో ఛాన్సు కొట్టేదెవరు?

జిల్లాలో జనసేన ఉనికి ప్రధానంగా తిరుపతిలోనే కనిపిస్తుంది. జిల్లా పార్టీ అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్, నియోజకవర్గ ఇంచార్జి కిరణ్ రాయల్, నగర అధ్యక్షుడు రాజారెడ్డి..ఈ ముగ్గురే పార్టీలో చెప్పుకోదగిన నాయకులు. వీరిలో కిరణ్ రాయల్ తరచూ కార్యక్రమాలు,ప్రెస్ మీట్లు, మీడియా డిబేట్లలో పాల్గొంటూ పార్టీ ఉనికిని చాటుతున్నారు. ఆ క్రమంలో తరచూ తమ అధినేత పవన్ కళ్యాణ్‌పై నోరు పారేసుకునే మాజీ మంత్రి రోజాతో గత వైసీపీ ప్రభుత్వంలో పోరాడి క్రిమినల్ కేసులు, పోలీసు వేధింపులు కూడా ఎదుర్కొన్నారు. ఆ కారణంగా తనకు ప్రాముఖ్యత కలిగిన నామినేటెడ్ పదవి కేటాయిస్తారని ఆయన అధిష్ఠానంపై నమ్మకం పెట్టుకున్నారు. అయితే తిరుపతి ఎమ్మెల్యే సిఫారసు ప్రామాణికమైతే మాత్రం ఈయనకు పదవి అనుమానమే అంటున్నారు. మొత్తం మీద వీరిలో కనీసం ఇద్దరికి పదవులు దక్కే అవకాశం ఉంది.

బీజేపీకి ఒక పదవి గ్యారంటీ

తిరుపతిలో వున్న బీజేపీ నేతల్లో భానుప్రకాష్‌రెడ్డి, సామంచి శ్రీనివాస్ చురుగ్గా వుంటూ కార్యకలాపాలు సాగిస్తున్నారు. గత ప్రభుత్వ తప్పిదాలపై వీరు తరచూ గళం విప్పి పార్టీ ఉనికి చాటారు. ఎన్నికల సమయంలో నవీన్‌కుమార్‌రెడ్డి కూడా బీజేపీలో చేరారు. భానుప్రకాష్‌రెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి ప్రజా ప్రయోజనాల కోసం అనేక సందర్భాల్లో న్యాయపోరాటాలు కూడా చేశారు.ఈ ముగ్గురూ నామినేటెడ్ పదవులు ఆశిస్తున్నారు. 60-40 నిష్పత్తి ఫార్ములాతో బీజేపీకి ఒక పదవి దక్కవచ్చు. అయితే అది ఏ పదవి, దాన్ని ఎవరు దక్కించుకుంటారనేది వేచి చూడాల్సి వుంది.

డబ్బుకోసం ఫ్రెండ్‌కే వల!

● బ్లాక్‌మెయిల్ కేసులో లా విద్యార్థులైన దంపతులకు రిమాండు

తిరుపతి (నేరవిభాగం/విశ్వవిద్యాలయాలు), జూలై 26: తిరుపతిలో ఓ లా విద్యార్థిని సస్పెండయ్యారు. ప్రస్తుతం ఐదేళ్ల లా ఇంటిగ్రేటెడ్ ఏడవ సెమిస్టర్ చదువుతూ బ్లాక్ మెయిల్ కేసులో ఇరుక్కున్న ఆమెను సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు.పోలీసుల కథనం మేరకు..ఎర్రావారిపాలేనికి చెందిన కృష్ణకిషోర్ రెడ్డి తిరుపతిలోని పుదిపట్లలో వుంటూ బీఎల్ చదువుతున్నాడు. తమిళనాడుకు చెందిన ఈయన భార్య సదాశివం ప్రణవ్ కృష్ణ కూడా బీఎల్ ఫైనల్ ఇయర్ చదువుతోంది. డబ్బు సంపాదన కోసం తన సహాధ్యాయి అయిన కర్నూలుకు చెందిన మహిళతో ప్రణవ్ కృష్ణ పరిచయం పెంచుకుంది. తన ఇంటికి తీసుకెళ్లింది. కూల్‌డ్రింక్‌లో మత్తుమందు కలిపి ఇచ్చింది. ఆమె మత్తులో వున్నప్పుడు భర్త కృష్ణకిషోర్‌తో కలిపి అసభ్య ఫొటోలు,వీడియోలు తీసింది. వాటిని ఆ మహిళతో పాటు ఆమె అన్నకు, కాబోయే భర్తకు పంపింది.భర్తతోకలిసి పెద్దఎత్తున డబ్బులు డిమాండు చేసింది. పదే పదే డబ్బు కోసం వేధిస్తుండడంతో ఆమహిళ శుక్రవారం ఎంఆర్‌పల్లి పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదుమేరకు సీఐ అహ్మద్ నేతృత్వంలో ఎస్‌ఐ నాగేంద్రబాబు కేసు నమోదు చేశారు.నిందితులైన సదాశివం ప్రణవ్‌కృష్ణ, కృష్ణకిషోర్ రెడ్డిలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

తహసీల్దార్ల బదిలీకి గ్రీన్ సిగ్నల్

● జిల్లా నుంచి రిలీవ్ అయిన 34మంది

తిరుపతి(కలెక్టరేట్), జూలై 26: ఎన్నికల ప్రక్రియ ముగిసి, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. పొరుగు జిల్లాల్లోని తహసీల్దార్లను సొంత జిల్లాలకు బదిలీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నాలుగురోజుల క్రితం సీసీఎల్‌ఏను ఆదేశించింది. అయితే అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో రికార్డులు దగ్ధమైన కారణంగా తహసీల్దార్ల బదిలీలకు బ్రేక్ పడింది. ఎట్టకేలకు ప్రభుత్వం నుంచి శుక్రవారం రాత్రి తహసీల్దార్లను రిలీవ్ చేయాలని చెప్పడంతో కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాలు ఇచ్చారు. జిల్లాలో పనిచేస్తున్న 34 మంది పొరుగు తహసీల్దార్లు ఆయా మండలాల్లోని డీటీలకు బాధ్యతలు అప్పగించి రిలీవ్ అయ్యారు. ఇక పొరుగు జిల్లాల్లో పనిచేస్తున్న సుమారు 42మంది మన జిల్లాకు చెందిన తహసీల్దార్లు శనివారం సాయంత్రానికి కలెక్టరేట్‌లో రిపోర్టు చేయనున్నారు. వీరందరికీ రెండు, మూడ్రోజుల్లో పోస్టింగ్స్ ఇవ్వనున్నారు.

ప్రాధాన్యత మండలాల కోసం పైరవీలు

ఇప్పటికే రాష్ట్రంలోని ఉన్నతాధికారులు, ఆయా నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేలు,రాజకీయ నేతల నుంచి కొందరు తహసీల్దార్లు పైరవీలు మొదలుపెట్టారు. తమకు ప్రాధాన్యత గల మండలం కావాలని జిల్లా అధికారులపై తీవ్రస్థాయిలో ఒత్తిళ్లు తెస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ భూములను అప్పటి ఎమ్మెల్యేలకు అప్పనంగా అప్పజెప్పిన తహసీల్దార్లను దూరంగా పెట్టి.. నిజాయితీగా పనిచేసేవారికి అవకాశం ఇవ్వాలని కూటమి నేతలు ప్రభుత్వానికి ఇప్పటికే విన్నవించారు.

నేడు ఎంబీయూలో బెలూన్ శాటిలైట్ ప్రయోగం

చంద్రగిరి, జూలై 26 : ఎ.రంగంపేట సమీపంలోని మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో శనివారం ఉదయం 10 గంటలకు బెలూన్ శాటిలైట్‌ను నింగిలోకి ప్రయోగించనున్నారు. ఎంబీయూ విద్యార్థులు తయారు చేసిన శాటిలైట్‌కు సంబంధించి అన్ని పరికరాలు పాకాల మండలం గాదంకి సమీపంలోని జాతీయ వాతావరణ పరిశోధనా ప్రయోగశాల(ఎన్ఏఆర్ఎల్), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(ఐఐఎస్టీ) సహకారంతో అభివృద్ధి చేశారు. కార్బన్ డయాక్సైడ్ స్థాయి, ఓజోన్ సాంద్రత, ఉష్ణోగ్రత, తేమ, వాతావరణ పీడనం వంటి పర్యావరణ పరిమితులను పర్యవేక్షించడానికి ఈ శాటిలైట్‌ను రూపొందించారు.ఇస్రో శాస్త్రవేత్తలు వీరముత్తువేల్, కల్పనా కాళహస్తి, తెన్మొయి శెల్వి, గోపీకృష్ణ, వెంకటరత్నం, ఎంబీయూ ఛాన్సలర్ మోహన్‌బాబు, ప్రో ఛాన్సలర్ మంచు విష్ణు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినయ్ మహేశ్వరి, వైస్ ఛాన్సలర్ నాగరాజరామారావు, చీఫ్ గ్రోత్ అండ్ స్ట్రాటజిక్ ఆఫీసర్ వికాస్ సింగ్, ఆర్ అండ్ డీ డీన్ ఈశ్వర్ తదితరులు పాల్గొంటారు.

కుప్పం ఆర్డీవోగా శ్రీనివాసులురాజు



కుప్పం, జూలై 26: కుప్పం ఆర్డీవోగా కొనుదూరు శ్రీనివాసులురాజును నియమిస్తూ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం ఆర్డీవోగా పనిచేస్తున్న ఈయన్ను కుప్పానికి బదిలీ చేశారు. కాగా, గతేడాది అక్టోబరులో కడప నుంచి భీమవరం వెళ్లిన శ్రీనివాసులురాజు ప్రస్తుతం బదిలీపై కుప్పం వచ్చారు. కుప్పం ఆర్డీవోగా పనిచేస్తున్న గోపల్లి శ్రీనివాసులును ప్రభుత్వానికి రిపోర్టు చేయాలని ఉత్తర్వులో పేర్కొన్నారు.

కొబ్బరికాయల వ్యాపారి కిడ్నాప్ సుఖాంతం

పోలీసుల అదుపులో నలుగురు నిందితులు

భాకరాపేట/తిరుపతి(నేరవిభాగం),జూలై 26: తిరుపతికి చెందిన వ్యాపారి కిడ్నాప్ కథ చివరకు సుఖాంతమైంది.చిన్నగొట్టిగల్లు మండలం చెరువు ముందరపల్లెకు చెందిన భాస్కర కొన్ని సంవత్సరాలుగా తిరుపతిలోని మంగళం ప్రాంతంలో నివాసం ఉంటున్నాడు. కొబ్బరికాయల వ్యాపారం చేస్తున్న ఈయన ఆటో కూడా నడుపుతుంటాడు.సొంత పనుల నిమిత్తం బుధవారం స్వగ్రామానికి వచ్చి తిరిగి తిరుపతికి వెళుతూ మార్గమధ్యంలోని చిన్నగొట్టిగల్లు వద్ద కిడ్నాప్ అయ్యాడు.తన కుమారుడు రెడ్డికిరణ్‌కు వాట్సప్ కాల్ చేసి తాను కిడ్నాపర్ల చెరలో వున్నట్లు తెలియ జేశాడు.రెడ్డికిరణ్ వెంటనే భాకరాపేట పోలీసులకు కిడ్నాప్ విషయం తెలిపాడు.రంగంలోకి దిగిన పోలీసులు ఫోన్ నెంబరు ఆధారంగా కిడ్నాపర్లు వెళుతున్న వాహనం లొకేషన్‌ను గుర్తించి పీలేరు సమీపంలో వెంబడించారు.పోలీసుల రాకను గుర్తించిన నలుగురు కిడ్నాపర్లు వారి వాహనాన్ని ఢీకొట్టి తిరుపతి వైపు పారిపోతుండగా చంద్రగిరి మండలం కాలూరు క్రాస్ వద్ద మరో పోలీసు బృందం కిడ్నాపర్లను అటకాయించింది.ఇదే సమయంలో కిడ్నాపర్ల వాహనం టైరు పంక్చర్ కావడంతో పోలీసులకు దొరికిపోయారు.కిడ్నాపర్ల ముఠాలో చిన్నగొట్టిగల్లుకు చెందిన జిషామ్‌తో పాటు బెంగళూరుకు చెందినవారున్నారని సమాచారం. ఎర్రచందనం స్మగ్లింగుతో కిడ్నాపర్లకు సంబంధమున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.ఆర్థిక లావాదేవీలే కిడ్నాప్‌కు కారణమని పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు.కిడ్నాప్ ఘటనకు సంబంధించి తిరుచానూరు స్టేషన్‌లో జీరో ఎఫ్ఐఆర్ నమోదై భాకరాపేట పోలీసులకు బదిలీ చేయబడింది.ఎస్పీ సుబ్బరాయుడి పర్యవేక్షణలో భాకరాపేట సీఐ మస్తాన్‌వలి, ఇన్‌ఛార్జ్ ఎస్ఐ ఈశ్వరయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీటీడీ సీఈ నియామకంలో సీనియారిటీ పాటించండి

● హైకోర్టు సూచన

తిరుమల, జూలై 26 (ఆంధ్రజ్యోతి): టీటీడీ చీఫ్ ఇంజనీర్ నియామకాన్ని ఏపీ హైకోర్టు తప్పుబట్టింది. సీనియారిటీకి అనుగుణంగానే సీఈ నియామకం జరపాలని టీటీడీని ఆదేశించింది. సీనియారిటీ ఉన్నప్పటికీ తనకు సీఈగా పదోన్నతి కల్పించలేదని, జూనియర్‌గా ఉన్న నాగేశ్వరరావుకు పదోన్నతి కల్పించారంటూ ఎస్ఈ సత్యనారాయణ 2019లో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై గతంలో కోర్టు కూడా స్పందిస్తూ సర్వీస్ రూల్స్‌కు అనుగుణంగా పదోన్నతి కల్పించాలని పలుమార్లు టీటీడీని ఆదేశించింది.నాగేశ్వరరావు ఫిట్ పర్సన్ అని, రికార్డ్స్ పరిశీలించి అతన్ని ఏకగ్రీవంగా సీఈగా ఎంపిక చేసినట్టు టీటీడీ కోర్టుకు వివరించింది.అయితే పిటిషన్‌దారు సమర్పించిన రికార్డులను పరిశీలించిన హైకోర్టు సత్యనారాయణ సీఈ పోస్టుకు అర్హుడని స్పష్టం చేసింది. డీపీసీ(డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ) నియమ నిబంధనలు పాటిస్తూ సత్యనారాయణను 2020 నుంచే సీఈగా పరిగణించాలని తీర్పు ఇచ్చింది.



హైకోర్టు తీర్పుపై దర్యాప్తు చేయండి:నవీన్


టీటీడీ చీఫ్ ఇంజనీర్ నియామకంపై హైకోర్టు ఇచ్చిన తీర్పుతో అయినా సమగ్ర దర్యాప్తునకు ఆదేశించి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని తిరుపతి బీజేపీ నేత నవీన్‌కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. టీటీడీ గత అదనపు ఈవో ధర్మారెడ్డి, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, ధర్మకర్తల మండలి ఛైర్మను స్వార్థ ప్రయోజనాల కోసం తమకు అనుకూలమైన వ్యక్తికి సీఈ బాధ్యతలు అప్పగించారన్నారు.అనుకూలమైన వ్యక్తిని నియమించడం ద్వారా టెండర్ల ద్వారా ఈ ప్రొక్యూర్మెంట్, ఆన్‌లైన్ టెండర్లలో కాంట్రాక్టర్ల వివరాలను ముందే తెలుసుకుని వారిని బెదిరించి రాజీ చేసిన తర్వాత తమకు అనుకూలమైన వారికి పనులు అప్పజెప్పి కమీషన్లు దండుకోవచ్చనే కుట్రతోనే నిబంధనలకు వ్యతిరేకంగా పదోన్నతులు కల్పించారన్నారు.

‘పెద్దిరెడ్డి’ గేట్లు తెరవడంలో మున్సిపల్ అధికారుల దొంగాట

● ఫొటోల కోసం రెండో గేటు తెరిచి నాటకాలు



ఒక గేటు తెరిచి...



ఒక గేటు మూసి

తిరుపతి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఇంటి ముందు గేట్లు తెరవడంలో తిరుపతి కార్పొరేషన్ అధికారులు దొంగాట ఆడుతున్నారు. కేవలం ఫొటోల కోసమే రెండో గేటు తెరిచి కమిషనర్ మౌర్యతో పాటు మీడియాను కూడా గేట్లు తెరిచేవున్నాయంటూ పక్కదారి పట్టిస్తున్నారు. కార్పొరేషన్ వేసిన రోడ్లపై తన ఇంటి ముందు ప్రజలెవరూ రాకపోకలు సాగించకుండా రెండు వైపులా పెద్దిరెడ్డి ఏర్పాటుచేసిన గేట్లను తెరిచివుంచాలని హైకోర్టు ఈ నెల 10వ తేది ఇచ్చిన ఆదేశాలను 15రోజుల తరువాత తీరిగ్గా అధికారులు అమలు చేశారనుకున్నారు. కానీ గురువారం మధ్యాహ్నం నుంచి రాత్రి 8గంటలవరకు రెండు గేట్లు తెరిచి తర్వాత మారుతీనగర్ వైపు వెళ్లే గేట్లను మూసివేశారు. గేట్లు తెరుచుకున్నాయన్న సమాచారంతో రాయల్ నగర్ వాసులు శుక్రవారం అటు వెళ్లగా పెద్దిరెడ్డి క్యాంప్ కార్యాలయం వరకు వెళ్లి తిరిగి అదేదారిలో వెనుదిరగాల్సి వచ్చింది.

● ఆదినుంచి అన్నీ ఆయనకు అనుకూలమే...

గత వైసీపీ ప్రభుత్వంలో మారుతీనగర్- రాయల్‌నగర్ వాసులకు సులభతరమైన మార్గం అవసరమని 2020లో కార్పొరేషన్ నిధులతో గుట్టుచప్పుడు కాకుండా అప్పటి యంత్రాంగం రోడ్లు వేసింది. కార్పొరేషన్ వేసిన రోడ్డుకు అడ్డంగా గేట్లు పెట్టుకున్న పెద్దిరెడ్డి దర్జాగా వాడుకోసాగారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతైనా గేట్లు తొలుగుతాయనుకున్నారు.కమిషనర్‌కు కూటమి నేతలు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో ఈ నెల మొదటి వారంలో గేట్లు తొలగించాలంటూ జనసేన నేతలు ఆందోళనకు దిగారు.అయితే గేటును తాకనీయకుండా పోలీసులు భారీబందోబస్తు చేపట్టారు.అది మున్సిపాలిటీ నిధులతో వేసిన రోడ్డా? కాదా? అని తేల్చాలని నివేదిక కోరేందుకు వారం రోజులు సమయం ఇచ్చారు. అంటే ఆలోపు పెద్దిరెడ్డి కోర్టును ఆశ్రయించేందుకు అవకాశం ఇచ్చారు. ఆయన కోర్టుకు వెళ్లిన తర్వాత అది మున్సిపాలిటీ రోడ్డేనని అధికారులు ఎమ్మెల్యేకు నివేదించారు.ఈనెల 10వ తేది మారుతీనగర్, రాయల్‌నగర్ మెయిన్‌రోడ్లను కలుపుతూ నిర్మించిన సిమెంట్ రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన గేట్లను మూసివేయవద్దని, సామాన్య ప్రజల రాకపోకలకు అవరోధం కల్పించవద్దని పెద్దిరెడ్డి కుటుంబ సభ్యులను హైకోర్టు ఆదేశించింది.15వ తేదీన హైకోర్టు ఉత్తర్వులు కార్పొరేషన్‌కు వస్తే పదిరోజుల పాటు ఆ ఆదేశాలను అమలు చేయనేలేదు. తీరా మీడియాలో కథనాలు రావడంతో రాత్రికిరాత్రే మధ్యలో మరో గేటుతో కొత్తనాటకానికి పెద్దిరెడ్డి తెరలేపితే అధికారులు సూత్రధారులుగా ఉన్నట్టు కనిపిస్తోంది. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో ఒక సమయంలో రెండు గేట్లు తెరిచినట్టు కనిపించినా క్యాంప్ ఆఫీస్ ముందు రెండు రోజుల క్రితం రాత్రికి రాత్రే యుద్ధప్రాతిపదికన మరో గేటును ఏర్పాటు చేశారు.దీంతో ఆ మార్గంలో ప్రయాణించేవారికి ఇబ్బందులు తప్పడంలేదు. హైకోర్టు విస్పష్టంగా గేట్లు తెరవాలన్న ఆదేశాలు జారీచేసినప్పటికీ కొత్తగా మరోగేటు ఏర్పాటు చేయడం చూస్తే అధికారంలో ఉన్నా లేకున్నా తన ఆధిక్యతను ప్రదర్శించడానికి హైకోర్టు ఆదేశాలను సైతం పెద్దిరెడ్డి లైట్ తీసుకున్నట్లు కన్పిస్తోంది.

ఎస్ఎస్‌డీ సంస్థ పేరుతో రూ.5లక్షల డిమాండ్

ఎస్పీకి ఫిర్యాదు చేసిన డీఎంహెచ్‌వో

తిరుపతి(వైద్యం), జూలై 26: సమతా సైనిక్ దళ్(ఎస్ఎస్‌డీ) సంస్థ పేరుతో బెదిరింపులకు గురి చేస్తూ రూ.5లక్షలు డిమాండ్ చేస్తున్నారంటూ డీఎంహెచ్‌వో శ్రీహరి శుక్రవారం ఎస్పీ సుబ్బరాయుడికి ఫిర్యాదు చేశారు. కొంతకాలంగా కల్యాణ్, సుబ్రహ్మణ్యం, నాగేంద్రలు ఎస్ఎస్‌డీ సంస్థ పేరుతో తనను నగదు డిమాండ్ చేయడంతోపాటు ఇవ్వకుంటే తప్పుడు ప్రచారాలకు తెరలేపుతామని బెదిరిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పైగా నేరుగా ఇంటికే వచ్చి బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. దీనికి సంబంధించిన పూర్తి ఆధారాలు కూడా ఎస్పీకి అందజేసినట్లు శ్రీహరి తెలిపారు.

ఫిర్యాదు చేసినందుకు కేసు పెట్టారు

వైద్య ఆరోగ్య శాఖలో అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న జిల్లా వైద్యాధికారి శ్రీహరిపై సమతా సైనికదళ్ సంస్థ తరఫున కలెక్టర్‌కు, హెల్త్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినందుకు తనపై అక్రమ కేసులు పెడుతున్నారని, సమతా సైనికదళ్ జిల్లా కార్యదర్శి గండికోట సుబ్రమణ్యం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాము డీఎంహెచ్‌వోను ఎలాంటి నగదు డిమాండ్ చేయలేదని పేర్కొన్నారు.



గోప్యంగా సామాజిక తనిఖీ వివరాలు !

ఎర్రావారిపాలెం, జూలై 26 : ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ బహిరంగ సమావేశంలో ఆడిట్ వివరాలన్నీ రహస్యంగానే పెట్టుకొని ముగించారు. ఎర్రావారిపాలెం మండలంలో వారంరోజులుగా ఈజీఎస్ పథకం 2023-2024 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సామాజిక తనిఖీ చేపట్టారు. క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు రాష్ట్ర స్థాయి ఆడిట్ అధికారులు, జిల్లా ఆడిట్ అధికారులు 24 మంది 12 గ్రామ పంచాయతీల్లో తనిఖీలు చేపట్టారు. శుక్రవారం మండల స్థాయిలో ఓపెన్ ఫోరం సమావేశం డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగింది. పథకం అమలులో జరిగిన అవకతవకలు, రికవరీ వివరాలు ప్రకటించకుండా ముగించడం ప్రజలను ఆశ్చర్యపరిచింది. అనధికారిక సమాచారం ప్రకారం ఎర్రావారిపాలెం మండలంలోని 12 గ్రామ పంచాయతీల్లో రూ.4.6 లక్షలు రికవరీ చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. 11మంది ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించేందుకు నిర్ణయించారు. ముగ్గురు టెక్నికల్ అసిస్టెంట్లను సస్పెన్షన్ హోల్డింగ్‌లో ఉంచారు. పెద్దమొత్తంలో అవకతవకలు గుర్తించి డీఆర్పీలు, ఎస్ఆర్పీలు రూ.లక్షల్లో రికవరీలకు సిఫార్సు చేయడంతో థర్డ్ పార్టీ ఆడిట్ విచారణకు పీడీ సిఫార్సు చేశారు. సాధారణంగా సోషల్ ఆడిట్ మండల స్థాయి సమావేశం అనంతరం ఆ వివరాలను డ్వామా పీడీ బహిరంగంగా చదివి వినిపించడం ఆనవాయితీ. మరి కొన్ని సందర్భాలలో మీడియాకు వివరాలు బ్రీఫింగ్ చేస్తారు. కానీ అటువంటి పద్ధతులు పాటించకుండా గుట్టుగా ముగించారు. ఈ సమావేశంలో ఏపీడీ పద్మలత, డీఆర్‌డీఏ ప్రోగ్రాం అధికారులు, ఏపీవో ఆశారాణి, అన్ని పార్టీల నాయకులు పాల్గొన్నారు.

తిరుమల క్యూకాంప్లెక్స్‌లో ఈవో తనిఖీలు

భక్తులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా



తిరుమల, జూలై26(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో భక్తులకు అందిస్తున్న సౌకర్యాలను ఈవో శ్యామలరావు శుక్రవారం అధికారులతో కలిసి పరిశీలించారు.అన్నప్రసాదాలు, తాగునీరు, పాల పంపిణీపై భక్తులను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు గోకులంలో శ్రీవాణిట్రస్టు ద్వారా భక్తులకు కేటాయిస్తున్న టికెట్ల జారీని ఈవో పరిశీలించారు.దాతల విభాగం పక్కనే ఉన్న ఆదిశేషు విశ్రాంతి గృహంలో తాత్కాలిక శ్రీవాణిట్రస్టు దర్శన టికెట్ల జారీ కౌంటర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఇందులో భక్తులు వేచి ఉండేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. డీఎఫ్‌వో కార్యాలయంలో పూర్తిస్థాయిలో శ్రీవాణి టికెట్ల జారీ కౌంటర్లను ఏర్పాటు చేయాలన్నారు.జేఈవో వీరబ్రహ్మం, సీఈ నాగేశ్వరరావు, ఎస్ఈ2 జగదీశ్వర్‌రెడ్డి, డిప్యూటీఈవో లోకనాథం, ఎలక్ట్రికల్ డీఈ రవిశంకర్‌రెడ్డి, వీజీవో నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.55 కోట్లు

తిరుమల, జూలై26(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామికి బుధవారం హుండీ ఆదాయం రూ.3.55 కోట్లు లభించింది. గురువారం 61,699 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే 25,082 మంది భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.మారిషస్ మంత్రి జార్జెస్ పైరె లెస్జోంగార్డ్, ప్రముఖ మృదంగ వాయిద్య కళాకారుడు ఎల్లా వెంకటేశ్వరరావు దర్శించుకున్నారు.

అమ్మవారికి వేడుకగా తిరువీధి ఉత్సవం



తిరుచానూరు, జూలై 26: తిరుచానూరులో కొలువైన పద్మావతి అమ్మవారు శుక్రవారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై కొలువుదీరి తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు.డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో రమేష్, సూపరింటెండెంట్ మధు, చంద్రశేఖర్, శేషగిరి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సుభాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో టీటీడీ అదనపు ఈవో



అమ్మవారి ఆలయం వద్ద వెంకయ్య చౌదరి

తిరుచానూరు/తిరుమల, జూలై 26(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులోని పద్మావతి అమ్మవారిని టీటీడీ అడిషనల్ ఈవో వెంకయ్య చౌదరి శుక్రవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. డిప్యూటీ ఈవో గోవిందరాజన్, అర్చకులు ఆయనకు ఆలయం వద్ద స్వాగతం పలికారు. వెంకయ్య చౌదరి మొదట ధ్వజస్తంభానికి నమస్కరించి అనంతరం అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. వేదపండితులు వేదాశీస్సులు చేసి ఆయనకు అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.అనంతరం రాత్రి 9.30 గంటలకు తిరుమలకు చేరుకున్న ఆయనకు స్పెషల్ టైప్ క్వార్టర్స్ వద డిప్యూటీఈవో లోకనాథం, రిసెప్షన్ అధికారులు హరీంద్రనాథ్, సత్రేనాయక్ స్వాగతం పలికారు. కాగా, వెంకయ్య చౌదరి శనివారం ఉదయం ఆలయంలోకి వెళ్లి 10.30-11 గంటల మధ్య టీటీడీ అదనపు ఈవోగా బాధ్యతలు స్వీకరించనున్నారు.

చంద్రగిరి రైల్వేస్టేషన్లో సౌకర్యాలు మెరుగుపరచండి

చంద్రగిరి, జూలై 26: చంద్రగిరి రైల్వేస్టేషన్లో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని స్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యులు శుక్రవారం స్టేషన్ మాస్టర్ సంగీత లక్ష్మికి విన్నవించారు. బీజేపీకి చెందిన సంగీతం దొరస్వామి, కె.గురవయ్య, సి.వెంకట్ రెడ్డి, మోహన్ రాజు, అత్తులూరి నరేష్ కుమార్ నాయుడులను కేంద్రప్రభుత్వం చంద్రగిరి రైల్వేస్టేషన్ అభివృద్ధికి కన్సల్టేటివ్ కమిటీ సభ్యులుగా నియమించింది. ఈ నేపథ్యంలో రైల్వేస్టేషన్‌ను శుక్రవారం పరిశీలించిన కమిటీ సభ్యులు శ్రీవారి భక్తుల సౌకర్యార్థం ఉచిత బస్సును స్టేషన్ వరకు పొడిగించి, భక్తులను శ్రీవారిమెట్టుకు తీసుకెళ్ళే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. స్టేషన్ సమీపంలో విద్యుద్దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. వెంకటాద్రి, మైసూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్ళను చంద్రగిరిలో ఆపాలని, స్టేషన్ సూచిక బోర్డులను పలు ప్రాంతాలలో ఏర్పాటు చేయాలని సూచించారు.

మూలస్థాన ఎల్లమ్మకు పొంగళ్ళు

చంద్రగిరి, జూలై 26: చంద్రగిరిలో వెలసిన మూలస్థాన ఎల్లమ్మకు కొత్తపేట, జమండ్ల వీధి, ఆకుతోట వీధి, చర్చి వీధి, మాతా వీధి, భవానీనగర్‌వాసులు, పీనపెద్ద మొక్కల రాజారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం అమ్మవారికి పొంగళ్లు పెట్టారు. ఎంపీటీసీ మాధవరెడ్డి, భాస్కర్‌రెడ్డి, పురుషోత్తంశెట్టి, మొక్కల రామ్మూరిరెడ్డి, తానాటి చంద్రశేఖర్‌రెడ్డి, ఒడుగు లక్ష్మమ్మ, కేశవులు పాల్గొన్నారు.

హథీరాం ఆలయ ధర్మకర్తగా శివానాయక్

తిరుపతి రూరల్, జూలై26: తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం పంచాయతీపరిధిలోని విద్యుత్‌నగర్‌లో కొత్తగా నిర్మిస్తున్న హథీరాం బావాజీ ఆలయ నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. వ్యవస్థాపక ధర్మకర్తగా భూక్య శివానాయక్, గౌరవాధ్యక్షుడిగా గుండాల గోపినాయక్, అధ్యక్షుడిగా చలపతినాయక్, కోశాధికారిగా హరిబాబునాయక్, ప్రధానకార్యదర్శిగా శివనాయక్, సభ్యులుగా ప్రసాద్, కుసుమ, హరిప్రసాద్, హరి, బాలాజి, కిశోర్‌లను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఈసందర్భంగా శివానాయక్ మాట్లాడుతూ బంజారా జాతి సహకారంతో రూ.5.70కోట్లతో సరికొత్తగా బావాజీ ఆలయాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు.

సమన్వయంతో పనిచేసి అభివృద్ధి చేసుకుందాం

తిరుపతి రూరల్, జూలై26: తిరుపతి రూరల్ మండలం వేంకటపతి నగర్ పంచాయతీలో శుక్రవారం సర్పంచ్ చిన్నియాదవ్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీలకతీతంగా అందరూ కలసి సమన్వయంతో పనిచేసి పంచాయతీని అభివృద్ధి చేసుకుందామని తెలిపారు.

పేరూరులో పారిశుధ్య పనులు

తిరుపతిరూరల్, జూలై26: తిరుపతి రూరల్ మండలం పేరూరు పంచాయతీలో శుక్రవారం ఫ్రైడే-డ్రైడే కార్యక్రమం నిర్వహించారు.సర్పంచ్ దామినేటి కేశవులు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఎంపీటీసీలు చంద్రమోహన్‌రెడ్డి, నవనీతమ్మ, టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు నాగూరు శ్రీనివాసులు, వార్డు సభ్యులు ధనలక్ష్మి, రాజారెడ్డి పాల్గొన్నారు.

క్యాన్సర్ వైద్య శిబిరానికి విశేష స్పందన

భాకరాపేట, జూలై 26: చిన్నగొట్టిగల్లు మండలం చట్టేవారిపాళెం పంచాయతీలో పింక్ బస్ ద్వారా స్విమ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరంలో పలువురు వైద్య పరీక్షలు చేయించుకున్నారు.సర్పంచ్ ధనలక్ష్మి, ఉపసర్పంచ్ మల్లికార్జున రెడ్డి, వైద్యులు పద్మావతి, హేమంత్ కుమార్, సీహెచ్‌వో శేషుకుమారి, ఏఎన్ఎం హరిత, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రగిరి

అన్నిరంగాల్లో ముందున్న మహిళలు

● మహతిలో అలరించిన నాటకాలు



తులసి జ్యోతి, భానుజకు సన్మానం

తిరుపతి (కల్చరల్), జూలై 26: మహిళలు నేడు అన్ని రంగాల్లో ముందున్నారని.. ఎస్వీ డబ్ల్యూ డిగ్రీ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ స్వరాజ్య లక్ష్మి అన్నారు. అభినయ ఆర్ట్స్ 24వ వార్షికోత్సవం సందర్భంగా భారత ప్రభుత్వ సాంస్కృతిక శాఖ, కొత్త డిల్లీ, ఆంధ్ర రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక శాఖ, అమరావతి, టీటీడీ సంయుక్త నిర్వహణలో హనుమ అవార్డ్స్ పోటీల్లో భాగంగా శుక్రవారం రాత్రి ఏడు గంటలకు మహిళాసభ జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వేడుకల్లో ప్రత్యేకంగా ఒక రోజు మహిళా సభ నిర్వహించడం, అందులో మహిళా కళాకారులను సత్కరించడం మంచి సంప్రదాయమని చెప్పారు. అనంతరం విద్య, సంగీత, నృత్య రంగాల్లో ప్రతిభ చూపిన మహిళలను పురస్కారాలతో నిర్వాహకులు సత్కరించారు. పురస్కార గ్రహీతల్లో.. డాక్టర్ తులసిజ్యోతి (ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, వెంకటగిరి), డాక్టర్ కొణిదల శోభ (అధ్యాపకులు, ఎస్వీడబ్ల్యూ డిగ్రీ కళాశాల, తిరుపతి), జి.వాణి (ఎస్వీ సంగీత కళాశాల), ఉషారాణి (ఎస్వీ సంగీత కళాశాల), ఎం.భానుజ (నాట్య కళాకారిణి), మహేశ్వరి (అభినయ ఆర్ట్స్), కామేశ్వరి (విద్యారంగం) ఉన్నారు. ఈ సభలో సంస్థ అధ్యక్షుడు మబ్బు సూర్యనారాయణ రెడ్డి, కార్యదర్శి బీఎన్ పాల్గొన్నారు. అంతకు ముందు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నృత్యపోటీలు నిర్వహించారు. మధ్యాహ్నం 3.30 గంటలకు టీవీజీ కళాక్షేత్రం కర్నూలు వారి శ్రీకృష్ణ కమలపాలిక పద్యనాటకం ప్రదర్శించారు. తర్వాత ప్రముఖ నాటక రంగ కళాకారుడు పల్లేటి కులశేఖర్‌ను విశిష్టకళాకారుడిగా నిర్వాహకులు సత్కరించారు. రాత్రి 8 గంటలకు శ్రీచైతన్య కళాభారతి కరీంనగర్ వారి చీకటి పువ్వు అనే సాంఘిక నాటిక ప్రదర్శించారు.

నేటి కార్యక్రమాలిలా.. : శనివారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వివిధ విభాగాల్లో నృత్యపోటీలు జరుగుతాయి. మధ్యాహ్నం 3.30 గంటలకు డాక్టర్ రామన్ ఫౌండేషన్, శ్రీసాయిబాబా నాట్య మండలి, విజయవాడ వారి పృథ్వీరాజ్ రాసో పద్యనాటకం ఉంటుంది. సాయంత్రం 6.30 గంటలకు అభినయ ఆర్ట్స్ గుంటూరు వారి ఇంద్రప్రస్థం సాంఘిక నాటిక, రాత్రి 8 గంటలకు శ్రీసాయి ఆర్ట్స్, కొలకలూరు వారి కౌసల్యా సుప్రజా రామ అనే సాంఘిక నాటిక ప్రదర్శిస్తారు.



నృత్య ప్రదర్శన



పల్లేటి కులశేఖర్‌కు సన్మానం



చీకటి పువ్వు - శ్రీకృష్ణ కమలపాలిక పద్యనాటకం

10 మంది 'ఎర్ర'స్మగ్లర్ల అరెస్టు

మంగళం, జూలై 26: టాస్క్‌ఫోర్స్ పోలీసులు పది మంది ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి ఆరు దుంగలు, రెండు కార్లు స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఐ కె.కృపానంద, ఆర్ఎస్ఐ కె.సురేష్ బాబుకు చెందిన బృందం దొరవారిసత్రం-నాయుడుపేట అటవీ ప్రాంతంవైపు శుక్రవారం కూంబింగ్ చేపట్టారు. అక్కడినుంచి సూళ్లూరుపేట బీటు పరిధిలోని తల్లంపాడు గ్రామం సమీపంలో ఉన్న జాతీయ రహదారిలో వాహనాల తనిఖీ నిర్వహించారు. అటువైపు వచ్చిన రెండు కార్లు వీరిని చూసి కొద్దిదూరంలోనే ఆపేసి, అందులోని వారు పారిపోయే ప్రయత్నం చేశారు. గమనించిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు వెంబడించి పది మంది పట్టుకున్నారు. వీరు.. తమిళనాడు వేలూరు జిల్లా ఆనైకట్టుకు చెందిన రాజమణి గోవిందస్వామి (41), విజయకుమార్ (32), శివకుమార్ వెల్లియన్ (26), కుమార్ ముత్తు (29), అరుల్ ముత్తుస్వామి (23), ప్రభు రాజి (25), అశోక్ కుమార్ (29), ఎం.గోపి (26), జ్ఞానశేఖర్ చిన్నతంబి (19), పూవరసన్ వరదన్ (27)గా గుర్తించారు. పరారైన మిగిలిన వారికోసం గాలిస్తున్నారు. అలాగే కార్లలోని ఆరు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, వాహనాలను సీజ్ చేశారు.

జూపార్కు వద్ద మరో ముగ్గురి అరెస్టు: ఏడు దుంగల స్వాధీనం

జూపార్కు ప్రహరీ వద్ద మరో ముగ్గురు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి ఏడు దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఐ(ఆపరేషన్స్) సురేష్‌కుమార్ రెడ్డికి చెందిన విశ్వనాథ్ బృందం గురువారం సాయంత్రం నుంచి శ్రీవారి మెట్టు పార్కింగ్ నుంచి జూపార్కు వైపు కూంబింగ్ చేపట్టారు. జూపార్కు ప్రహరీ వద్ద కొందరు వ్యక్తులు కారులో ఎర్రచందనం దుంగలు లోడ్ చేస్తూ తారసపడ్డారు. అదేసమయంలో టాస్క్‌ఫోర్సు సిబ్బందిని చూసి స్మగ్లర్లు కారును వదలి పారిపోయారు. కారులో చూడగా నాలుగు ఎర్రచందనం దుంగలు కనిపించాయి. వాటితోపాటు కారును స్వాధీనం చేసుకున్నారు. అలాగే తిరుమల రెండో ఘాట్‌లోని 36వ కల్వర్టు వద్ద ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. అదుపులోకి తీసుకుని విచారించగా, జూపార్కు వద్ద పరారైన స్మగ్లర్లను గుర్తించారు. అనంతరం వీరు సమీపంలో దాచి ఉంచిన మరో మూడు దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారు తమిళనాడు తిరువన్నామలై జిల్లా జమునామత్తూరుకు చెందిన గోపి అయ్యాకన్ను(26), శివరాజ్ మాణిక్యం(39), గోవిందరాజ్(32)గా గుర్తించారు. ఈ రెండు కేసులను తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసు స్టేషన్‌కు తరలించి.. సీఐ శ్రీనివాసులు, సురేష్‌కుమార్‌లు దర్యాప్తు చేపట్టారు.

ఇలాగైతే పూర్తయ్యేదెప్పుడు?

● నత్తనడకన 'చెన్నై - తిరుపతి బైపాస్ రైలు మార్గం' పనులు

● 'రెవెన్యూ' చొరవ లేకపోవడమే కారణమంటున్న రైల్వే వర్గాలు



రైలు మార్గం మ్యాప్



రేణిగుంట వద్ద జరుగుతున్న బైపాస్ రైలు మార్గం పనులు

తిరుపతి(సెంట్రల్), జూలై 26: రేణిగుంట సంతగేటు వద్ద జరుగుతున్న చెన్నై- తిరుపతి బైపాస్ రైలు మార్గం పనులు నత్తనడకన సాగుతున్నాయి. రెవెన్యూ అధికారులు తగిన చొరవ చూపక పోవడమే దీనికి కారణమని రైల్వే వర్గాలు అంటున్నాయి. రేణిగుంట రైల్వేస్టేషన్‌పై రైళ్ల రద్దీ తగ్గించి, సమయాన్ని ఆదా చేయడానికి దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఈ బైపాస్ రైలు మార్గం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ పనులను 2023 ఏప్రిల్‌లో ప్రారంభించారు. దీనికోసం రూ.22కోట్లు మంజూరయ్యాయి. ఇందులో రూ.4.30కోట్లు భూసేకరణకు, రూ.17.70 కోట్లు రైలు మార్గం పూర్తి చేయడానికి కేటాయించారు. గత ఏడాది నుంచి పనులు జరుగుతున్నాయి. భూసేకరణకు సంబంధించిన మొత్తాన్ని రాష్ట్ర రెవెన్యూ శాఖకు రైల్వే అధికారులు చెల్లించారు. అయితే భూసేకరణ చేయడంలో రెవెన్యూ అధికారులు ప్రారంభంలో చూపిన చొరవ.. రోజులు గడిచేకొద్దీ చూపడం లేదన్న విమర్శలున్నాయి.

ఏం జరిగిందంటే..

భూసేకరణలో భాగంగా రేణిగుంట మండలంలోని నక్కల కాలనీ, గాంధీనగర్‌లోని 53 నివాస గృహాల యజమానులు నిరాశ్రయులవుతారు. వీరికి నష్టపరిహారం చెల్లించి, ప్రత్యామ్నాయంగా ఇంటి స్థలం ఇవ్వాలని క్షేత్రస్థాయి అధికారులు ప్రభుత్వానికి నివేదికలు పంపారు. నిరాశ్రయుల్లోని కొందరు షికారీలు మాత్రం తమకు ఇక్కడే ఇంటి స్థలాలు కావాలని పట్టుబడుతున్నారు. ఈ సమస్యను గత వైసీపీ ప్రభుత్వంలో పరిష్కరించలేదు. దీనివల్ల డిసెంబరు నెలాఖరుకు పూర్తి కావాల్సిన బైపాస్ రైలుమార్గం మరో ఏడాది పట్టే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వమైనా స్పందించి భూసేకరణ పూర్తి చేసి.. రైల్వే అధికారులకు సహకరించాల్సిన అవసరం ఉంది.

ఆకట్టుకున్న శ్రీకృష్ణ రాయభారం



గోవులను నిలువరిస్తున్న అర్జున పాత్రధారి

రామచంద్రాపురం, జూలై26: మండలంలోని పరమాల, బుట్టిరెడ్డికండ్రిగ, మోటావారికండ్రిగ మహాభారత ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం భాగవతారణి సుమతి వినిపించిన శ్రీకృష్ణ రాయభారం సభికులను ఆకట్టుకుంది. మధ్యాహ్నం ఉత్తర గోగ్రహణం సందర్భంగా అర్జున పాత్ర వేషధారి గోవులను మళ్లించే కార్యక్రమం ఆకట్టుకుంది.ఆలయ ధర్మకర్త రమేష్‌నాయుడు, సురేంద్రనాయుడు, జయరామిరెడ్డి, దుర్వాసులు, చంద్రారెడ్డి, రోశిరెడ్డి పాల్గొన్నారు.

డాక్టర్‌ని బెదిరించిన వారిపై కేసులు పెట్టండి : సీఐటీయూ

తిరుపతి(ఆటోనగర్),జూలై26: బాలాయపల్లి మండలం సుబ్రమణ్యం గ్రామంలోని పీహెచ్‌సీలో గురువారం డాక్టర్‌ని బెదిరించిన టీడీపీ నాయకులపై కేసులు నమోదు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి డిమాండ్ చేశారు.దౌర్జన్యం చేయడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. ఉద్యోగులను వేధించడం మానుకోని పక్షంలో తాము ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

ఆ నేరస్తుల చిట్టా బయటకు తీయండి

టీడీపీ శ్రేణులపై దాడుల కేసుల్లో వివరాల సేకరణ

తిరుపతి(నేరవిభాగం), జూలై 26: ఐదేళ్ల కాలంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు, హత్యలు, హత్యాయత్నాలకు పాల్పడిన వారి జాబితాను ప్రభుత్వానికి పంపాలని ఎస్పీకి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. దీంతో సబ్ డివిజన్ల వారీగా సర్కిల్ కార్యాలయాల నుంచి వివరాలు సేకరించే పనిలో పోలీసులున్నారు. మరోవైపు ఐదేళ్ల కాలంలో వైసీపీ నాయకులు తప్పులు చేసినా..ఎక్కడా కేసులు నమోదు చేసిన దాఖలాలు లేవు. ప్రధానంగా శ్రీకాళహస్తి, చంద్రగిరి, నాయుడుపేట, సత్యవేడు, గూడూరు, తిరుపతి పరిధిలోని చాలా ప్రాంతాల్లో వైసీపీ శ్రేణులు రెచ్చిపోయి.. విధ్వంసాలకు పాల్పడ్డారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వారం రోజుల తర్వాత ఎంఆర్‌పల్లె సర్కిల్‌లో తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు రవినాయుడు, ఆనందగౌడ్ ఆధ్వర్యంలో సంబరాలు చేసి,బాణసంచా కాల్చి ర్యాలీ నిర్వహించారు.దీనిపై ఎస్పీ ఆదేశాలతో తెలుగుయువత నాయకులపై ఎస్వీయూ పోలీసులు కేసులు నమోదు చేశారు.దీనిపై ఉన్నతాధికారులు సీరియస్‌గా స్పందించిన విషయం విదితమే.మరోవైపు మొన్న జరిగిన సార్వత్రిక ఎన్నికల సమయంలో కొంతమంది టీడీపీనాయకులపై పోలీసులు తప్పుడు కేసులు నమోదు చేశారనే ఆరోపణలున్నాయి.వీటన్నింటిపైనా సమగ్రజాబితా తయారు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

ఇన్‌స్పైర్ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(విద్య), జూలై 26: ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో ఆరునుంచి పది తరగతులు చదివే విద్యార్థులు ఇన్‌స్పైర్ అవార్డులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీఈవో డాక్టర్ వి.శేఖర్ సూచించారు. దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్లను శుక్రవారం జిల్లాసైన్స్ అధికారి భానుప్రసాద్, అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ శివశంకరయ్య, కమ్యూనిటీ మొబలైజేషన్ ఆఫీసర్ సురేష్‌తో కలసి ఆవిష్కరించారు. శేఖర్ మాట్లాడుతూ.. కేంద్రశాస్త్ర సాంకేతిక మండలి, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే ఇన్‌స్పైర్‌కి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. సెప్టెంబరు 15వ తేదీవరకు దరఖాస్తుకు అవకాశం ఉందని తెలిపారు. అప్పర్ ప్రైమరీ పాఠశాల నుంచి 3, హైస్కూల్ నుంచి 5చొప్పున ఇన్‌స్పైర్‌కి నామినేషన్లు చేయాలని, ఇతర వివరాలకు జిల్లా సైన్స్ అధికారి ఫోన్‌నెంబరు 94405 11983ని సంప్రదించాలని కోరారు. సమగ్ర శిక్ష అధికారులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై దృష్టి పెట్టాలి

ఎడ్లబండిపై తరలించినా జరిమానా విధించండి: కలెక్టర్



జిల్లా అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), జూలై 26: జిల్లాలో ఇసుక అక్రమ రవాణాపై దృష్టి పెట్టాలని జిల్లా యంత్రాంగాన్ని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. శుక్రవారం రాత్రి అమరావతి నుంచి నూతన ఇసుక పంపిణీపై భూగర్భ గనులశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ముకేష్‌కుమార్ మీనా వర్చువల్ విధానంలో జిల్లా అధికారులతో సమీక్షించారు. ఎస్పీ సుబ్బరాయుడితో కలిసి కలెక్టర్ హాజరయ్యారు. వీసీ తర్వాత అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడారు. నూతన ఇసుక విధానం అమలుకు ఏర్పాటైన జిల్లాస్థాయి కమిటీలోని సభ్యులందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నియోజకవర్గ, మండల స్థాయి కమిటీలు కూడా సమర్థవంతంగా పనిచేయాలన్నారు. అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పటిష్ఠ నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. ఎడ్లబండిపై అక్రమంగా ఇసుక రవాణా చేసినా జరిమానా విధించాలని ఆదేశాలిచ్చారు. డీఆర్వో పెంచలకిషోర్, అడిషనల్ ఎస్పీ వెంకట్రావు, సెబ్ అదనపు ఎస్పీ రాజేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

మీ అబ్బాయి మా కస్టడీలో ఉన్నాడు

● తల్లిదండ్రులకు ఫేక్ వాట్సప్ కాల్స్

● నమ్మిమోసపోవద్దని నిపుణుల సూచన



ఫేక్ వాట్సప్ కాల్ స్క్రీన్ షాట్

పుత్తూరు అర్బన్, జూలై 26: మీ అబ్బాయి మా కస్టడీలో ఉన్నాడు... జైలుకు పంపకుండా ఉండాలంటే ఖర్చు అవుతుంది. త్వరగా నిర్ణయం తీసుకోండి... అంటూ పోలీసులమని చెప్పుకునే వ్యక్తులు కుటుంబ సభ్యులకు వాట్సప్ కాల్స్ చేసిన సంఘటన పుత్తూరులో జరిగింది. పట్టణానికి చెందిన ఎలక్ట్రానిక్ మీడియా సీనియర్ జర్నలిస్ట్ ఈ.ఆనంద్‌కు ఒక కుమార్తె ఉంది. ఆమె ఐటీ ప్రొఫెషనల్‌గా బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తోంది. శుక్రవారం మధ్యాహ్నం ఆనంద్‌కు ఓ వాట్సప్ కాల్ వచ్చింది. అందులోని ప్రొఫైల్ పిక్‌లో పోలీస్ అధికారి ఫొటో కూడా ఉంది. ఫోన్ చేసిన వ్యక్తి ఇంగ్లీష్, హిందీ భాషలో ఆనంద్‌తో మాట్లాడాడు. తనను తాను పోలీస్ అధికారిగా పరిచయం చేసుకుంటూ మీ అబ్బాయి బెంగళూరులో మా కస్టడీలో ఉన్నాడు. ఒక రేప్ కేసులో అరెస్ట్ చేశాం. జైలుకి పంపకుండా ఉండాలంటే కొంత మొత్తం అర్జంట్‌గా మేము చెప్పిన బ్యాంకు ఖాతాకు పంపండి. లేకుంటే మీ అబ్బాయి పరిస్థితి ఊహించుకోలేరు అనేది సారాంశం. అయితే ఆనంద్‌కు కుమారులు ఎవరూ లేకపోవడంతో ఆ విషయాన్ని బయటపెట్టకుండా... 'పర్వాలేదు తప్పు చేసి ఉంటే జైలుకు పంపండి... ఏదైనా ఉంటే మా లోకల్ పోలీసులకు సమాచారం ఇవ్వండి అప్పుడు మేము ఆలోచిస్తాం... ఫోన్ చేసి విసిగిస్తే మీపైన సైబర్ క్రైంకు కంప్లైంట్ ఇవ్వాల్సి ఉంటుందని హెచ్చరించడంతో అవతల వ్యక్తి ఫోన్ కట్ చేశాడు. సంబంధిత ఫోన్ కాల్ పాకిస్తాన్ దేశానికి చెందిన నెంబర్‌గా ట్రూకాలర్ ద్వారా తెలుస్తోందని ఆనంద్ తెలిపారు. పక్క రాష్ట్రాల్లో విద్య, ఉద్యోగం చేస్తున్న వారి వివరాలు సేకరించి తల్లిదండ్రులకు ఇలా ఫోన్‌లు చేసి మోసం చేస్తుండడం ఇటీవల పత్రికల్లో వస్తున్నాయి. ఇలాంటి వారి మాయమాటలు నమ్మి మోసపోవద్దని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

సెల్ఫ్ సపోర్టింగ్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 26: ఎస్వీయూ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ సెల్ఫ్ సపోర్టింగ్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానించారు. ఆగస్టు 2వ తేదీ దరఖాస్తుకు చివరి గడువుగా విధించినట్టు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు తెలిపారు. సమగ్ర సమాచారం కోసం.. ఎస్వీయూనివర్సిటీ.ఎడ్యూ.ఇన్.డీవోఏ.. వెబ్‌సైట్ చూడాలని శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో కోరారు.

కార్గిల్ వీరులకు ఘన నివాళి



వీరనారీమణులకు సన్మానం

తిరుపతి(రూరల్), జూలై 26: ఎస్వీ వెటర్నరీ కళాశాలలో 2(ఏ)ఆర్అండ్‌వీ రెజిమెంట్(ఎన్‌సీసీ) ఆధ్వర్యంలో శుక్రవారం కార్గిల్ దివస్‌ను ఘనంగా జరుపుకొన్నారు. ఇందులో భాగంగా కార్గిల్ అమరవీరులకు నివాళి అర్పించారు. వీరనారీలు దివంగత సెప్ పొన్నయ్య సతీమణి ఎస్తేర్, లాన్స్‌నాయక్ కన్నయ్య సతీమణి సరస్వతి, నాయక్‌జొల్లు రెడ్డెప్పరెడ్డి సతీమణి రమణమ్మలకు సన్మానం చేశారు. గౌరవార్థం వీరికి యూనిట్ సీడీటీఎస్ నేతృత్వంలో గుర్రపు ప్రదర్శన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన తిరుపతి గ్రూప్ కమాండర్ కల్నల్ యోగేష్ దుంగరకోటి మాట్లాడుతూ కార్గిల్ యుద్ధంలో సైనికుల పరాక్రమాన్ని, త్యాగాన్ని మరువలేమని, వారిని గౌరవించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు. వివిధ పోరాటాలలో దేశాన్ని రక్షించిన యోధులందరికీ నివాళిఅర్పిస్తున్నామని తెలిపారు. కల్నల్ ప్రకాష్‌కుమార్, క్యాడెట్లు పాల్గొన్నారు.

రామచంద్రాపురం : రామాపురం వద్ద నున్న ఎరిటాస్ సైనిక పాఠశాల ఆధ్వర్యంలో తిరుపతి వినాయకనగర్ మైదానంలో ఎన్జీవో కాలనీలోని అమరవీరుల స్థూపం వరకు శుక్రవారం కవాతు నిర్వహించారు. వెరిటాస్ పాఠశాల అధినేత శేషారెడ్డి కార్గిల్ యుద్ధంలో సైనికుడిగా పాల్గొనడం తనకెంతో గర్వంగా ఉందన్నారు. కార్గిల్ పోరులో ప్రాణాలర్పించిన సైనికులకు ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు శ్రీకర్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, డీన్ సీజీహెచ్ ఖాన్, ప్రిన్సిపాల్ చక్రవర్తి పాల్గొన్నారు.

కార్గిల్ అమరవీరులకు నివాళులు



స్కూల్లో కుప్పకూలిన సన్‌షేడ్

● సైన్స్ విద్యార్థి దుర్మరణం



గురుమహేంద్ర (ఫైల్ ఫొటో)



ఘటనాస్థలిని పరిశీలిస్తున్న డీఈవో రామారావు

నెల్లూరు (విద్య/క్రైం), జూలై 26 : నెల్లూరులోని కేఎన్ఆర్ పాఠశాలలో శుక్రవారం సాయంత్రం నిర్మాణంలో ఉన్న భవనం గోడ కూలి కిందపడడంతో ఓ విద్యార్థి దుర్మరణం పాలయ్యాడు.వెంకటగిరి ప్రాంతానికి చెందిన కొత్తపాలెం గురవయ్య, రూప దంపతులకు ఇద్దరు కుమారులు. బిడ్డల చదువుల కోసం వీరు నెల్లూరుకు వలసొచ్చారు.ఇస్కాన్ సిటీలోని ఓ అపార్ట్‌మెంట్‌లో గురవయ్య వాచ్‌మన్‌గా పని చేస్తుండగా, రూప కూలి పనులకు వెళుతోంది. వీరి చిన్న కుమారుడు గురుమహేంద్ర (14) కేఎన్ఆర్ నగరపాలక సంస్థ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు.శుక్రవారం ఉదయం పాఠశాలకు వెళ్లిన మహేంద్ర సాయంత్రం లాంగ్‌బెల్ తర్వాత నిర్మాణంలో ఉన్న నాడు-నేడు రెండవ దశ అదనపు తరగతి గదుల మొండి గోడల వద్దకు వెళ్లి గోడపైన ఉన్న లింటల్‌ను పట్టుకొని ఆడుకుంటున్న సమయంలో లింటల్, దానిమీద ఉన్న గోడ విరిగి గురుమహేంద్రపై పడ్డాయి.గమనించిన తోటి విద్యార్థులు అక్కడే ఉన్న ఉపాధ్యాయులకు తెలిపారు. హుటాహుటిన వారు గోడకింద ఉన్న విద్యార్థిని బయటకు తీశారు. గోడ బలంగా గురుమహేంద్ర తలపై పడటంతో తల పగిలి అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు.ప్రధానోపాధ్యాయుడు ఎం.విజయ ప్రకాష్ వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో డీఎస్పీ శ్రీనివాసులరెడ్డితోపాటు సీఐ నారాయణ సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. జీజీహెచ్‌లో పోస్టుమార్టం అనంతరం విద్యార్థి మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు. వందల మంది విద్యార్థులకు ఇద్దరే ఉపాధ్యాయులు ఉండటంతో విద్యార్థులను అదుపు చేయడం కష్టంగా మారుతోందని, అందుకే ప్రమాదం జరిగిందని పాఠశాల హెచ్‌ఎం పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈ సంఘటనతో కేఎన్ఆర్ నగరపాలక ప్రాథమిక పాఠశాలలో నాడు-నేడు కింద జరిగిన భవన నిర్మాణ పనుల్లో డొల్లతనం బయటపడింది. పనులు నాసిరకంగా జరగడంతో లింటల్ లెవల్ సన్‌షేడ్ శుక్రవారం కూలిపోయింది. కాంక్రీట్ బీమ్స్‌లో నుంచి ఇనుపచువ్వలు సైతం బయటకు పొడుచుకుని వచ్చాయి. చనిపోయిన విద్యార్థి గురుమహేంద్ర కుటుం సభ్యులకు ప్రభుత్వం తరఫున అండగా నిలుస్తామని, రూ.5లక్షల పరిహారం అందచేస్తామని మంత్రి నారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి చెక్కును అందజేస్తామని తెలిపారు. కేఎన్ఆర్ పాఠశాలలో జరిగిన ప్రమాద ఘటనకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ది పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ నేతలు డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తిరుపతి (ఆటోనగర్), జూలై 26: మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తిరుపతి టౌన్ డివిజన్ ఈఈ కె.వాసుదేవరెడ్డి తెలిపారు. కొర్లగుంట, మధురానగర్, రైల్వే కాలనీ, సుందరయ్యనగర్, భవానీ నగర్, రెడ్డి అండ్ రెడ్డి కాలనీ, తుడా రోడ్డు, వీవీ మహల్ రోడ్డు, తిలక్‌రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

అలరించిన సంగీత కచేరీలు



తిరుపతి (కల్చరల్), జూలై 26: త్యాగరాజస్వామి ట్రస్టు 80వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం జరిగిన సంగీత సభలు ఆహూతులను అలరించాయి. రాత్రి 8 గంటలకు మృదంగ విద్వాంసుడు పద్మశ్రీ యల్లా వెంకటేశ్వరరావు పాల్గొన్న గాత్రసభ సంగీతప్రియులను ఆకట్టుకుంది. అంతకు ముందు సాయంత్రం నాలుగు నుంచి 5.30 గంటలవరకు శ్రీవేంకటేశ్వర సంగీత నృత్య కళాశాల విద్యార్థుల కచేరి జరిగింది. 5.45 నుంచి రాత్రి 7.45 వరకు షిమోగా కుమారస్వామి బృందం నిర్వహించిన కచేరి అలరించింది. ఈ కార్యక్రమంలో కంచి రఘురామ్, భానుమూర్తి పాల్గొన్నారు.

జగన్‌ని డ్రామాల రెడ్డిగా పిలుస్తాం : బీజేపీ



మీడియాతో భానుప్రకాష్‌రెడ్డి

తిరుపతి అర్బన్, జూలై 26: మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డిని ఇకపై డ్రామాలరెడ్డిగా పిలుస్తామని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఢిల్లీలో జగన్ చేసింది ధర్నాలా లేదని, అచ్చం డ్రామాలాడుతున్నట్లు ఉందని స్పష్టం చేశారు. ప్రజలు ఇచ్చిన దెబ్బకు మతిపోయిందన్నారు. రాష్ట్రపతి పాలన ఎప్పుడు విధిస్తారో తెలియని వ్యక్తి రాష్ట్రాన్ని ఎలా పాలించారో అర్థం కావడం లేదన్నారు. 'మీరు.. మీరు కొట్టుకు చంపుకుని.. ఆ నేరాన్ని కూటమిపై వేస్తారా?' అంటూ వైసీపీ శ్రేణులపై ఆగ్రహించారు. ప్రభుత్వం ఏర్పడి 44రోజులే అయ్యిందని అప్పుడే విమర్శలు చేయడం తగదన్నారు. వికసిత్ ఆంధ్రాకు అడుగులు పడుతున్నాయని, సీమాంధ్రను స్వర్ణాంధ్రగా మారుస్తామన్నారు. మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో రికార్డులు కాల్చితే దోషులు తప్పించుకోలేరని, 956ఎకరాలు కాజేసిన పాపాల పెద్దిరెడ్డిని వదిలిపెట్టే ప్రసక్తేలేదన్నారు. టీడీఆర్ బాండ్ల కుంభకోణాన్ని త్వరలో ఆధారాలతో సహా బయటపెడతామని స్పష్టం చేశారు. అజయ్‌కుమార్, వరప్రసాద్, జీవన్‌రాయల్, సుబ్బుయాదవ్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల మెదడులో వ్యత్యాసాలు గుర్తించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో శ్రీహరి

తిరుపతి (వైద్యం), జూలై 26: చిన్నపిల్లల మెదడు పెరుగుదలలో వచ్చే వ్యత్యాసాలను ముందుగానే గుర్తించాలని, అప్పుడే వారి మానసిక, శారీరక ఆరోగ్యాన్ని రక్షించే అవకాశం ఉంటుందని డీఎంహెచ్‌వో శ్రీహరి అన్నారు. రుయాస్పత్రిలోని చిన్నపిల్లల విభాగంలో యునైటెడ్ నేషనల్ చిల్డ్రన్స్ ఫండ్(యుఎన్‌సీఎఫ్) సంస్థ వారి ఆధ్వర్యంలో చిన్నపిల్లల్లో మెదడు అభివృద్ధి వ్యత్యాసాల్లో కలిగే మార్పులను గుర్తించడంపై వైద్యులకు శుక్రవారం రెండ్రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్య చికిత్సా పద్ధతులపై యుఎన్‌సీఎఫ్ దక్షిణాది రాష్ట్రాల ఇన్‌చార్జి శ్రీధర్ వివరించారు. ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్, ఆర్‌బీఎస్‌కే రాష్ట్ర సమన్వయకర్త ప్రశాంత్, ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ పద్మావతి, వైద్యాధికారులు శశికళ, సంతోష్, మనోహర్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సొసైటీకి రక్తనిధి పరికరాల వితరణ



కలెక్టర్‌కు అందజేసిన రక్తనిధి పరికరాలు

తిరుపతి (కలెక్టరేట్), జూలై 26: జిల్లాలో కొత్తగా ఏర్పాటైన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ(ఐఆర్‌సీఎస్) రక్తనిధి కేంద్రానికి జిందాల్ పవర్ లిమిటెడ్ సంస్థ రూ.12లక్షలు విలువైన రక్తనిధి పరికరాలు, ఏసీలు, కంప్యూటర్ వంటివి వితరణ చేశారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జిందాల్ పవర్ లిమిటెడ్(సింహపురి) యూనిట్‌ప్రతినిధులు కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వీటిని అందజేశారు. జిందాల్ పవర్ లిమిటెడ్ ప్రతినిధులు శ్రీనివాసరావు, జోబిన్ మథ్యూస్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు- కదిరిదేవరపల్లి మధ్య ప్యాసింజరు రైళ్ల రద్దు

తిరుపతి(సెంట్రల్), జూలై 26: తిరుపతి- కదిరిదేవరపల్లి మధ్య నడుస్తున్న ప్యాసింజరు రైళ్ల (07589-07590)ను గుంతకల్లు- కదిరిదేవరపల్లి మధ్య రాకపోకలను ఆగస్టు ఒకటి నుంచి 31వ తేదీవరకు రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. తిరుపతి నుంచి గుంతకల్లు వరకు ఈ ప్యాసింజరు రైళ్లు యథావిధిగా రాక పోకలు నిర్వహిస్తాయని పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

కలెక్టరుకు విన్నవించిన పారిశుధ్య కార్మికులు

తిరుపతి(వైద్యం), జూలై 26: తమ సమస్యలు పరిష్కరించాలని రుయా, ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి, ఎస్వీ వైద్య కళాశాలలో పనిచేసే పారిశుధ్య కార్మికులు కోరారు. ఈ మేరకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టర్ వెంకటేశ్వర్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. తక్కువ మందితో ఎక్కువ పని చేయించడమే కాకుండా పీఎఫ్, ఈఎస్ఐ కూడా ఇవ్వకుండా ఏజన్సీ నిర్వాహకులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. దీనికితోడు మూడు నెలలుగా జీతాలు కూడా ఇవ్వలేదని వాపోయారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, ఏపీ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేంద్ర, నేతలు శివకుమార్, మణి తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్ బదిలీపై వెళ్లడం వల్లే..

నర్సింగ్ సూపరింటెండెంట్‌పై విచారణకు అడ్మినిస్ట్రేటర్‌ను నియమించాం

రుయాస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్

తిరుపతి(వైద్యం), జూలై 26: 'నర్సింగ్ సూపరింటెండెంట్ అరుణమ్మపై వచ్చిన ఆరోపణలపై మొదట కార్పొరేషన్ కమిషనర్‌ను విచారణ అధికారిగా నియమించారు. ఆమె బదిలీపై వెళ్లడం వల్లే ఎస్వీ వైద్య కళాశాల, రుయాస్పత్రి అడ్మినిస్ట్రేటర్ కనకనరసారెడ్డిని విచారణ అధికారిగా నియమించారు' అని రుయాస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ రాధ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి నివేదికలను త్వరలోనే కలెక్టరుకు అందజేస్తామన్నారు.

హోంమంత్రిని కలిసిన తెలుగు మహిళ



తిరుపతి (జీవకోన), జూలై 26: రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత.. విజయవాడలో తెలుగు మహిళ కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవకోనకు చెందిన తెలుగు మహిళా కార్యదర్శి కుమారమ్మ శుక్రవారం హోంమంత్రిని కలిశారు. వైసీపీ ప్రభుత్వంలో ఎదుర్కొన్న సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. మహిళలకు ఎల్లపుడూ భరోసాగా ఉంటామని హోంమంత్రి తెలిపినట్లు కుమారమ్మ చెప్పారు.

నారాయణ విద్యార్థుల గోగ్రీన్ ర్యాలీ



తిరుపతి(రూరల్), జూలై 26: కపిలతీర్థం సమీపంలోని నారాయణ పాఠశాల విద్యార్థులు శుక్రవారం నగరంలో గోగ్రీన్ ర్యాలీని నిర్వహించారు. వాతావరణ కాలుష్య నివారణకు మొక్కలు నాటాల్సిన ఆవశ్యకతపై ప్రజలను చైతన్యపరిచారు. చిన్నారులు మొక్కలను చేతపట్టి ప్రదర్శించారు. ప్రిన్సిపాల్ సుధాకర్‌నాయుడు, సీవో సుదర్శన్, ఆర్ఐ వసంతకుమార్, టీచర్లు పాల్గొన్నారు.

కార్గిల్ విజయ్ దివస్



అమరవీరుల స్తూపం వద్ద మాజీ సైనికోద్యోగుల నివాళి



గోవిందరాజస్వామి కళాశాలలో మొక్క నాటుతున్న ప్రిన్సిపాల్, విశ్రాంత ఆర్మీ అధికారి

తిరుపతి (విద్య), జూలై 26: కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమాన్ని పలు ప్రజా సంఘాలు, పార్టీలు, కళాశాలల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అమరులైన జవాన్లకు నివాళి అర్పించారు. ● కపిలతీర్థం సమీపంలోని అమరవీరుల స్తూపం వద్ద మాజీ సైనికులు పుష్పాంజలి ఘటించారు. ● ఎస్వీ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రకాష్‌బాబు, ఎన్‌సీసీ 29(ఏ) ఆర్మీ బెటాలియన్ ఇన్‌చార్జి సీటీవో లోకేష్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. అధ్యాపకులు పాల్గొన్నారు. ● గోవిందరాజస్వామి కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సత్యనారాయణ నేతృత్వంలో ఎన్‌సీసీ ఆర్మీ వింగ్, ఎయిర్ వింగ్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. కార్గిల్ యుద్ధ పోరాట యోధుడు, రిటైర్డ్ ఆర్మీ అధికారి కెప్టెన్ కె.మార్కండేయులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆనాటి సంగతులను విద్యార్థులకు తెలియజేశారు. ● బీజేపీ ఆధ్వర్యంలో కపిలతీర్థం సమీపంలోని అమరవీరుల స్తూపం వద్ద పుష్పాంజలి ఘటించారు. గుండాల గోపీనాథ్‌రెడ్డి, పెనుబాల చంద్రశేఖర్, తొండమనాటి సుబ్రహ్మణ్యంరెడ్డి, సుబ్రహ్మణ్యం యాదవ్, మల్లారపు రవిప్రసాద్, ఫణిభూషణ్‌రెడ్డి, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి ప్లానర్స్ అండ్ ఇంజనీర్స్ ఎక్స్‌పో

తిరుపతి అర్బన్, జూలై 26: తిరుచానూరురోడ్డులోని శిల్పారామంలో శని, ఆదివారాల్లో టేప్ (ది అసోసియేషన్ ఆఫ్ ప్లానర్స్ అండ్ ఇంజనీర్స్ అసోసియేషన్) ఆధ్వర్యంలో ఎక్స్‌పో నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు ప్రసాద్‌రెడ్డి వెల్లడించారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్స్, మ్యాన్‌ఫ్యాక్చరింగ్‌కు సంబంధించిన అన్ని రకాల ప్రాపర్టీస్ మెటీరియల్స్, టెక్నాలజీ మిషనరీ, ఎక్విప్‌మెంట్ ప్రదర్శనతో పాటు నిపుణులతో సూచనలు, సలహాలు అందిస్తామన్నారు. ప్రవేశం ఉచితమని, నగరప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వచ్చినవారందరికి కూపన్ అందిస్తామని, ప్రతి గంటకు లక్కీడ్రా తీసి విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు.

బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించండి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 26: గతంలో నిర్వహించినట్టుగానే బ్యాలెట్ పద్ధతిలో ఎస్వీయూలో నాన్ టీచింగ్ ఎన్నికలు నిర్వహించాలని ఈసీ మెంబర్ ఆదిశేషయ్య ఉన్నతాధికారులను కోరారు. దీనిపై ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడిని శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. వైస్ ప్రెసిడెంట్, జాయింట్ సెక్రటరీ, ట్రెజరర్ పోస్టులకు పోస్టల్ బ్యాలెట్ విధానం ద్వారా ఎన్నిక చేపట్టాలన్నారు.

పరిమిత ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం

తిరుపతి(ఆటోనగర్), జూలై 26: ముఫ్ఫదులు దాటిన ప్రతి ఒక్కరూ పరిమితమైన ఆహారాన్ని తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంతో జీవించవచ్చని డాక్టర్ వెంకయ్య బాబు అన్నారు. జీవకోనలో రాష్ట్రీయ సేవాసమితి(రాస్) ఆధ్వర్యంలో టాటా ట్రస్ట్ క్యాన్సర్ ఆస్పత్రి సౌజన్యంతో మహిళలకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 150 మంది మహిళలకు బీపీ, షుగర్, హెపటైటిస్, తదితర పరీక్షలను ఉచితంగా చేశారు. పీఆర్‌వో హేమంత్‌కుమార్, నాగేశ్వర్ రావు, శ్రీదేవి, వేదాచలం, భ్రమరాంబ,మునిలక్ష్మి, పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలు తొలగిస్తున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), జూలై 26: నగరంలోని రోడ్లపై ఉన్న ఆక్రమణలను ఎస్పీ సుబ్బరాయుడి ఆదేశాలతో పోలీసులు శుక్రవారం తొలగించారు. రోడ్లన్నీ వెడల్పుగా కనిపించేలా చేయాలని సూచించడంతో ఆయా డీఎస్పీల నేతృత్వంలో శాంతి భద్రతల పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు ఆరు బృందాలుగా ఏర్పడ్డారు. నిమ్మకాయల వీధి, భేరి వీధి, రైల్వేస్టేషన్, బస్టాండు, దేవేంధర్ థియేటరు రోడ్డు, గాంధీ రోడ్డు ఇలా దాదాపు 30 రోడ్లపైన ఉన్న ఆక్రమణలను తొలగించారు. ఆక్రమణల తొలగింపుపై అదనపు ఎస్పీ కులశేఖర్ దిశానిర్దేశం చేశారు. ట్రాఫిక్ డీఎస్పీ రమణకుమార్, తిరుపతి డీఎస్పీ రవిమనోహరాచారి, తిరుపతి రూరల్ డీఎస్పీ నేతృత్వంలో ఆక్రమణదారులకు తొలి దశలో హెచ్చరికలు జారీ చేశారు. మరోసారి ఆక్రమించి.. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తే కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ఫుట్‌పాత్‌లను సైతం శుభ్రం చేయించారు. అలాగే శ్రీకాళహస్తి, చంద్రగిరి, నాయుడుపేట, గూడూరు తదితర పట్టణాల్లోనూ ఆక్రమణలు తొలగించారు.

ఎక్సైజ్ శాఖ ఏకీకృతంపై హర్షం

జిల్లా ఎక్సైజ్ శాఖ ఉద్యోగుల సంఘం అధికార ప్రతినిధి రామకృష్ణశాస్త్రి



తిరుపతి(నేరవిభాగం), జూలై 26: వైసీపీ ప్రభుత్వంలో రెండు విభజించిన ఎక్సైజ్ శాఖను ఏకీకృతం చేస్తున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించడం హర్షణీయమని జిల్లా ఎక్సైజ్ శాఖ ఉద్యోగులు సంఘం అధికార ప్రతినిధి రామకృష్ణ శాస్త్రి చెప్పారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఏకీకృతం చేయాలని తమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జవహర్‌బాబు, సభ్యులు ముఖ్యమంత్రితోపాటు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌ను కలిసి విజ్ఞప్తి చేశారన్నారు. ఈ విషయంలో స్పందించి మంచి నిర్ణయాన్ని తీసుకున్న ప్రభుత్వానికి ఎక్సైజ్ శాఖ తరపున ధన్యవాదాలన్నారు.

నీట్ సీట్ల కేటాయింపు డిజిటల్ సమాచారం సిద్ధం

తిరుపతి(విద్య), జూలై 26: నీట్ సీట్ల కేటాయింపుకు సంబంధించిన సమాచారాన్ని డిజిటల్ బుక్‌లెట్ రూపంలో సిద్ధం చేసినట్టు ఐఐటీ, జేఈఈ నీట్ ఫోరం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. నీట్-2024 పరీక్ష రాసిన విద్యార్థులకు సీట్ల కేటాయింపుపై ఓ అవగాహనకోసం నీట్-2023 సీట్ల కేటాయింపు జరిగిన సమాచారాన్ని ఇందులో పొందుపరిచినట్టు వెల్లడించారు. ఎంబీబీఎస్, బీడీఎస్ రౌండ్ 1, రౌండ్ 2, మాప్ అప్ రౌండ్ ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న మెడికల్ కళాశాలల్లో ర్యాంకు, రిజర్వేషన్ వారీగా సీట్ల కేటాయింపును క్రోడీకరించి బుక్‌లెట్‌ను సిద్ధం చేసినట్టు వివరించారు. ఈ బుక్‌లెట్‌కోసం, మరింత సమాచారం కోసం నీట్ సీట్ అని టైప్‌చేసి 98490 16661 నెంబరుకు వాట్సాప్ మెసేజ్ పంపాలని సూచించారు.

డాక్టరేట్ ప్రదానం



ఫణి కుమార్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 26: ఎస్వీయూ సివిల్ ఇంజనీరింగ్ పరిశోధకుడు వి.ఫణికుమార్ డాక్టరేట్ పొందారు. డెవలప్‌మెంట్ ఆఫ్ అడాప్టివ్ న్యూరో ఫజ్జీ ఇన్ఫరెన్స్ సిస్టం ఫర్ ప్రిడిక్షన్ ఆఫ్ సేఫ్ బేరింగ్ కెపాసిటీ ఆఫ్ క్లే సాయిల్స్ అంశంపై ప్రొఫెసర్ సీహెచ్ సుధారాణి పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. ఈ మేరకు సీఈ దామ్లా నాయక్ తెలిపారు.

స్మార్ట్ సిటీ పనుల పూర్తికి రాష్ట్ర వాటా నిధులు విడుదల చేయండి

మంత్రి నారాయణను కోరిన ఎమ్మెల్యే ఆరణి

తిరుపతి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో జరుగుతున్న స్మార్ట్ సిటీ పనుల పూర్తికి రాష్ట్ర ప్రభుత్వం వాటా కింద రావాల్సిన రూ.210 కోట్లను విడుదల చేయాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. ఈ మేరకు మంత్రి నారాయణను అమరావతి సచివాలయంలో శుక్రవారం మధ్యాహ్నం కలిసి విజ్ఞప్తి చేశారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర వాటా నిధులు విడుదల చేయకపోవడంతో కమర్షియల్ ఆపరేషన్స్ సెంటర్ సహా 23 పనులు నత్తనడకన సాగుతున్నట్లు వివరించారు. అలాగే బాలాజీ సాగర్ సామర్థ్యం పెంచి నగరవాసులకు, శ్రీవారి భక్తుల దాహార్తి తీర్చాలన్నారు. ఇటీవల కార్పొరేషన్‌లో విలీనమైన శెట్టిపల్లి గ్రామస్థులు, రైతుల భూ పునరావాసంపై స్పెషల్ ఆఫీసర్‌ను నియమించి సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు.

వ్యాధి నిర్ధారణతో చికిత్స సులభతరం



తిరుపతి (రూరల్), జూలై 26: కచ్చితమైన వ్యాధినిర్ధారణతో చికిత్స సులభతరమవుతుందని స్విమ్స్ నెఫ్రాలజీ హెడ్ డాక్టర్ వి.శివకుమార్ అన్నారు. ఎస్వీవెటర్నరీ వర్సిటీలో రాష్ట్రీయ పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాల(ఎస్ఎల్‌డీఎల్) ఆధ్వర్యంలో ఆంత్రాక్స్ వ్యాధి(పశువులు, గొర్రెలు, మేకలు, పందులు) నిర్ధారణ-నివారణపై మూడ్రోజులపాటు నిర్వహించిన అవగాహన సదస్సు శుక్రవారంతో ముగిసింది. యూఎస్ఏ ఆంత్రాక్స్ ప్రాజెక్ట్ సౌజన్యంతో డేటా ట్రయాంగులేషన్ సదస్సు నిర్వహించారు. ఏపీతోపాటు ఒడిశా, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన పశువైద్యాధికారులు, శాస్త్రవేత్తలు హాజరయ్యారు. ఆంత్రాక్స్ వ్యాధి నివారణకు చేపట్టాల్సిన చర్యలపై విస్తృత చర్చ నిర్వహించినట్లు ఎస్ఎల్‌డీఎల్ హెడ్, ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ ప్రొఫెసర్ డాక్టర్ రాణీప్రమీల వివరించారు. వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్ శ్రీలత, వెటర్నరీ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ కె.వీరబ్రహ్మయ్య, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ డాక్టర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలసిన పులుగోరు మురళి



తిరుపతి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): తిరుపతి టీడీపీ నేత, టౌన్ బ్యాంకు మాజీ చైర్మన్ పులుగోరు మురళీకృష్ణారెడ్డి శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. అమరావతిలో మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డితోపాటు ఆయన సీఎంను కలసి నామినేటెడ్ పదవుల కేటాయింపులో తనకు ప్రాధాన్యమివ్వాలని కోరారు. పార్టీకి తాను అందించిన సేవలను వివరిస్తూ వినతి పత్రం కూడా అందజేశారు. తాజా ఎన్నికల్లో తనకు అప్పగించిన క్లస్టర్‌లో కూటమి అభ్యర్థి గెలుపునకు శక్తివంచన లేకుండా పనిచేశానని వివరించారు.

పయ్యావులను కలసిన కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ



తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో ఏకైక టీడీపీ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ శుక్రవారం రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను కలిశారు. తిరుపతి ప్రాధాన్యాన్ని దృష్టిలో వుంచుకుని నగర అభివృద్ధికి ప్రభుత్వం నుంచి గణనీయంగా నిధులు కేటాయించేలా చూడాలని కోరారు. మునికృష్ణ వెంట 35వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు ఎస్వీఎం శ్రీధర్, కార్యదర్శి జగన్నాథం, 27వ డివిజన్ అధ్యక్షుడు నాగప్రతాప్, సుబ్రమణ్యంనాయుడు తదితరులు వున్నారు.

చంద్రబాబును కలసిన ఎస్టీయూ నేత



తిరుపతి నగరం మంగళంలోని ట్రెండ్స్ జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు, ఎస్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి.కృష్ణమనాయుడు శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. ఉపాధ్యాయ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యలను సకాలంలో పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఆయన వెంట యూటీఎఫ్ కార్యవర్గ సభ్యుడు వి.చంద్రశేఖర్ నాయుడు వున్నారు.

యువతకు ఉపాధి అవకాశాలు కల్పించండి

తిరుపతి(కలెక్టరేట్), జూలై 26: జిల్లాలో యువతకు ఉపాధి కల్పించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి కార్యాచరణ ప్రణాళికలపై సంబంధిత అధికారులతో శుక్రవారం కలెక్టరేట్‌లో సమీక్షించారు. పరిశ్రమలను, వివిధ కంపెనీలను, వ్యాపార సంస్థలను సంప్రదించి వారి అవసరాలకు అనుగుణంగా నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ ఇప్పించి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. డీఆర్‌డీఏ పీడీ ప్రభావతి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ప్రతాప్‌రెడ్డి, వివిధ యూనివర్సిటీల ప్రతినిధులు పాల్గొన్నారు.

వెటర్నరీలో పెరటికోళ్ల పెంపకంపై ముగిసిన శిక్షణ

తిరుపతిరూరల్, జూలై 26: తిరుపతిలోని ఎస్వీవెటర్నరీ వర్సిటీలో పెరటికోళ్ల పెంపకంపై మహిళా రైతులకు నిర్వహించిన మూడ్రోజుల నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. నిరంతర పశువైద్యవిద్య, సమాచార కేంద్రం ఆధ్వర్యంలో నార్మ్(ఐసీఏఆర్) ఆర్థిక సౌజన్యంతో ఈ కార్యక్రమం జరిగింది. ఈ శిక్షణకు ఓజిలి మండలానికి చెందిన అరిమేనుపాడు, కుందాం, ఓజిలి, పెదపరియ, కురుగొండ, చిలమానుచేను గ్రామాలకు చెందిన 30మంది మహిళా రైతులు హాజరయ్యారు. అతిథిగా హాజరైన వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్(డీఈ) సీహెచ్ శ్రీలతతో సీసీవీఈసీ కోఆర్డినేటర్ డాక్టర్ కె.సుజాత, నార్మ్ ప్రధానశాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలక్రిష్ణన్ కలిసి అసీల్ జాతి కోడిపిల్లలు, వాటరర్, ఫీడర్, క్రేన్స్‌ని పంపిణీ చేశారు. డాక్టర్ కె.జయశ్రీ పాల్గొన్నారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

తిరుపతి(నేరవిభాగం), జూలై 26: రైలు కిందపడి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే సీఐ హేమసుందరరావు తెలిపిన వివరాల మేరకు.. 35 సంవత్సరాలున్న యువకుడు తిరుపతి రైల్వేస్టేషన్‌లో రైలు కదులుతున్న సమయంలో దాని కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎలాంటి వ్యక్తిగత ఆధారాలు లభించలేదని, ఆచూకీ తెలిసినవారు రైల్వే సీఐ 94406 27638కు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాకు తరలించి, కేసు నమోదు చేశారు.

తవ్వింది ఎంత.. దోచింది ఎంత?

- క్వార్ట్జ్, సిలికా అక్రమాలపై ప్రభుత్వం సీరియస్
- పూర్తిస్థాయి విచారణకు ఆదేశం
- పలు జిల్లాల అధికారులతో ఏడు బృందాలు
- ప్రభుత్వ నిర్ణయంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు

అధికారమే అండగా వైసీపీ నేతలు సాగించిన దోపిడీ అంతా ఇంత కాదు. క్వార్ట్జ్(తెల్లరాయి), సిలికా వంటి విలువైన ప్రజాసంపదను కొల్లగొట్టి రూ.వేల కోట్లు దోచుకున్నారు. ఈ అక్రమాల పుట్ట బద్దలయ్యే సమయం ఆసన్నమైంది. జిల్లాలోని ఖనిజ సంపద దోపిడీని ఎన్డీయే కూటమి ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలో జరిగిన ఈ దోపిడీపై విచారణకు ఆదేశించింది. పలు జిల్లాల అధికారులతో ఏడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది. వెంటనే నెల్లూరుకు చేరుకున్న విచారణాధికారులు తవ్వకాలు జరిగిన ప్రాంతాల్లో కొలతలు తీస్తున్నారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నారు. ఆ నివేదికలు అందిన వెంటనే ప్రభుత్వం క్రిమినల్ కేసులతో పాటు అక్రమార్కుల నుంచి దోచుకున్న ప్రజా సంపదను రికవరీ చేయాలని నిర్ణయించుకుంది. దీంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.

నెల్లూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): సైదాపురం, పొదలకూరు, గూడూరు రూరల్, రాపూరు మండలాల్లో ఎక్కడపడితే అక్కడ వైసీపీ నాయకులు విచ్చలవిడిగా తెల్లరాయిని తవ్వుకెళ్లారు. ప్రభుత్వం, అటవీ భూములతోపాటు పట్టా భూముల్లోనూ రైతులు, మైనింగ్ లీజుదారులను బెదిరించి క్వార్ట్జ్‌ను కొల్లగొట్టారు. అప్పట్లో ప్రతిపక్ష నేతలు ఈ తవ్వకాలను అడ్డుకున్నా, ప్రజలు గగ్గోలు పెట్టినా ప్రభుత్వ పెద్దలు పట్టించుకోలేదు. వైసీపీ నేతలే తెరవెనుక ఇదంతా చేయించడంతో నాడు ఎవరూ నోరు మెదపలేదు. చివరకు టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేయడంతో అధికార యంత్రాంగం ఎన్నికల కోడ్ వచ్చాక విచారణకు పూనుకుంది. దాదాపు ఆరు లక్షల మెట్రిక్ టన్నుల క్వార్ట్జ్ ను దోపిడీ చేసినట్లు నిర్ధారించి, రూ.255 కోట్ల పెనాల్టీలు విధించారు. దీని విలువ బహిరంగ మార్కెట్లో రూ.వేల కోట్లు ఉంటుంది. ఈ అక్రమ తవ్వకాలకు వైసీపీ నేతలు బాధ్యులని గుర్తించి దాదాపు 200 మందికి మైనింగ్ అధికారులు నోటీసులు కూడా జారీ చేశారు. తాజాగా మరోసారి క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలపై పూర్తిస్థాయిలో విచారించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

● బెదిరించి లాగేసుకుని..!

చిల్లకూరు, కోట మండలాల్లోని అరుదైన సిలికా ఖనిజాన్ని వైసీపీ నేతలు హైజాక్ చేశారు. లీజుదారులను బెదిరించి మైన్‌లను బలవంతంగా లాగేసుకున్నారు. 80 లీజులు ఉండగా అన్నిటినీ వైసీపీ నేతల చేతుల్లోకి వెళ్లిపోయాయి. నాడు మైనింగ్ లీజుదారులు టన్ను సిలికాను రూ.400 ధరతో డీలర్ లైసెన్సుదారులకు విక్రయించేవారు. వీరు కంపెనీలకు రూ.600 చొప్పున విక్రయించుకునేవారు. కానీ వైసీపీ ప్రభుత్వం వచ్చాక సిలికా మొత్తాన్ని లాగేసుకొని మైన్ లీజుదారులకు టన్ను రూ.100 చొప్పున ఇచ్చారు. అదే సిలికాను డీలర్ లైసెన్సుదారులకు రూ.1400 చొప్పున అమ్మడం ప్రారంభించారు. డీలర్లు టన్ను సిలికాను రూ.1800కు కంపెనీలకు విక్రయించాల్సి వచ్చింది. దీంతో కంపెనీలన్నీ జిల్లాలోని సిలికాకు బదులు గుజరాత్, రాజస్థాన్ ప్రాంతాల నుంచి కొనుగోలు చేయడం మొదలుపెట్టాయి. ఇక అక్రమార్కులు దాదాపు 400 ఎకరాల ప్రభుత్వ భూముల్లో కూడా సిలికాను తవ్వేశారు. కొందరు రైతులను బెదిరించి ఎకరానికి రూ.3 లక్షల చొప్పున ఇచ్చి ఆ భూముల్లో కూడా సిలికాను ఎత్తేశారు. ఇలా ఐదేళ్లపాటు సాగించిన దోపిడీ ద్వారా రూ.వేల కోట్ల ప్రజా సంపదను కొల్లగొట్టారు.


సైదాపురంలో అక్రమ తవ్వకాలపై ఆరా తీస్తున్న విచారణాధికారులు

● విచారణకు ఏడు బృందాలు

సిలికా, క్వార్ట్జ్ అక్రమాలపై విచారణకు ఏడు బృందాలను ఏర్పాటు చేస్తూ మైనింగ్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ రెండు రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేశారు. మూడు బృందాలకు నెల్లూరు మైనింగ్ డీడీ శ్రీనివాస కుమార్, మరో నాలుగు బృందాలకు గూడూరు డివిజన్ మైనింగ్ అధికారి డీవీ రంగకుమార్ నేతృత్వం వహిస్తున్నారు. నెల్లూరు, ఒంగోలు, మార్కాపురం, తిరుపతి, గూడూరు, పలమనేరు, చిత్తూరు, దాచేపల్లి మైనింగ్ కార్యాలయాల అసిస్టెంట్ జియాలజిస్టులు, సర్వేయర్లు, సూపర్‌వైజర్లు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్లు, టెక్నికల్ అసిస్టెంట్లను విచారణ బృందాల్లో సభ్యులుగా నియమించారు. నెల్లూరు, గూడూరు మైనింగ్ కార్యాలయాల పరిధిలో ఉన్న అన్ని క్వార్ట్జ్, మైకా, ఫెల్డ్‌స్పార్, సిలికా లీజు మైన్లలో తనిఖీలు నిర్వహించాలని, అనధికారిక తవ్వకాలు జరిగిన ప్రదేశాల్లోనూ తనిఖీలు నిర్వహించి నివేదికలను సమర్పించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వెంకటగిరి అభివృద్ధికి సహకరించండి

ఎమ్మెల్యే కురుగొండ్ల


స్పీకర్, మంత్రి నిమ్మలతో ఎమ్మెల్యే

వెంకటగిరి, జూలై 26: నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామా నాయుడికి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం అసెంబ్లీ సమావేశం అనంతరం స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రిని మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం నియోజకవర్గంలో నీటిపారుదల శాఖ పరిధిలోని ప్రాజెక్టుల నిర్మాణాన్ని గత వైసీపీ ప్రభుత్వం అర్ధంతరంగా నిలిపివేసిందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రూ.400 కోట్ల అంచనాతో 2016లో టీడీపీ ప్రభుత్వంలో ఆల్తూరుపాడు రిజర్వాయర్ మంజూరైందని, కొంతమేర పనులు జరిగాయన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పనులను నిలిపివేసిందన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే ఉమ్మడి నెల్లూరు జిల్లాతో పాటు తిరుపతి జిల్లాలో సుమారు లక్షా 60వేల ఎకరాలకు సాగునీరు, తిరుపతి నగరం, శ్రీకాళహస్తి పట్టణానికి తాగునీరు అందుతుందని చెప్పారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు కురుగొండ్ల చెప్పారు.

మహిళల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు



హోం మంత్రి అనితతో లీలావతి తదితరులు

గూడూరు, జూలై 26: మహిళల రక్షణ కోసం టీడీపీ ప్రభుత్వం ప్రత్యేక చట్టాలు తీసుకురానున్నట్లు హోం మంత్రి అనిత తెలిపినట్లు తెలుగుమహిళ రాష్ట్ర కార్యదర్శి గుండాల లీలావతి పేర్కొన్నారు. శుక్రవారం అమరావతిలో తెలుగు మహిళా నేతలతో హోం మంత్రి అనిత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లీలావతి మాట్లాడుతూ... మహిళలపై ఎక్కడ అన్యాయం జరిగినా టీడీపీ అండగా ఉంటుందన్నారు. అన్యాయాలకు పాల్పడేవారిపై కఠిన శిక్షలు అమలు చేస్తామన్నారు. అదేవిధంగా అసెంబ్లీ ఆవరణలో ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌ను లీలావతి మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు.

కీచకులను కఠినంగా శిక్షించాలి


ఆర్టీసీ కూడలిలో నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఎఫ్ కార్యకర్తలు

శ్రీకాళహస్తి, జూలై 26: ఆడవారిపై అత్యాచారాలకు తెగబడుతున్న కీచకులను కఠినంగా శిక్షించాలని ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి మునిచందు అన్నారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలకు నిరసనగా శుక్రవారం శ్రీకాళహస్తి పట్టణంలోని ఆర్టీసీ కూడలి వద్ద ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ర్యాలీ ధర్నా జరిగింది. ఈ సందర్భంగా మునిచందు మాట్లాడుతూ... రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల వినియోగం విపరీతంగా పెరిగిపోయిందన్నారు. వికృత వ్యసనాల కారణంగా సమాజంలో నేరాలు పెరిగిపోతున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం కీచక వ్యక్తుల పట్ల కఠినంగా వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పట్టణ కార్యదర్శి అభి, నాయకులు సతీష్, షాహిద్, జయప్రకాష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆడబిడ్డల చదువుతోనే సమాజాభివృద్ధి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రసాద్

శ్రీకాళహస్తి, జూలై 26: ఆడబిడ్డలు అందరూ విద్యావంతులుగా మారితేనే సమాజాభివృద్ధి సాధ్యమని తొట్టంబేడు ఎంపీడీవో ప్రసాద్ అన్నారు. తొట్టంబేడులో శుక్రవారం క్రైసంస్థ పిలుపుమేరకు నిర్వహిస్తున్న హూరి పధాయి దేశ్ కి భళాయి కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ వర్కర్లకు బాలికల విద్యపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో ప్రసాద్ మాట్లాడుతూ... సమాజంలో లింగ వివక్ష నశించి అందరూ చదువుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈవోపీఆర్డీ తనుజాక్షి, అంగన్వాడీ సూపర్‌వైజర్లు రాజేశ్వరి, మంజుల పాల్గొన్నారు.

ధర్మరాజస్వామి ఆలయానికి అర్జునుడి పంచలోహ ఉత్సవ విగ్రహం



పిచ్చాటూరు, జూలై 26: పిచ్చాటూరులోని ధర్మరాజస్వామి ఆలయానికి అర్జునుడి పంచలోహ విగ్రహం సమకూరింది. ఇప్పటి వరకు ఆలయంలో శ్రీకృష్ణుడు, ధర్మరాజు, భీమసేనుడు, ద్రౌపదీ దేవి పంచలోహ విగ్రహాలు మాత్రమే ఉండేవి. మిగిలిన దేవతామూర్తులకు కలపతో చేసిన ఉత్సవమూర్తులు ఉండేవి. ఆగస్టులో ఆలయంలో ధర్మరాజ తిరుణాళ్ల నిర్వహించనున్న నేపథ్యంలో గ్రామస్తులు అర్జునుడి పంచలోహ విగ్రహం చేయించేందుకు సంకల్పించారు. ఈ నేపథ్యంలో తమిళనాడులోని తిరువలాంగాడులో అర్జునుడి పంచలోహ విగ్రహాన్ని తయారు చేయించి శుక్రవారం సాయంత్రం పిచ్చాటూరులోని ధర్మరాజు ఆలయానికి తీసుకొచ్చారు.

విద్యార్థుల లక్ష్య సాధనలో టీచర్లే కీలకం


ప్రధానోపాధ్యాయురాలికి సన్మానం

నారాయణవనం, జూలై 26: విద్యార్థుల లక్ష్య సాధనలో ఉపాధ్యాయులే కీలకంగా వ్యవహరిస్తారని పుత్తూరు డీవైఈవో ప్రభాకర్‌రాజు అన్నారు. శుక్రవారం పాలమంగలం ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గత ఐదేళ్లలో ఎస్ఎస్సీ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించడం, ఐదుగురు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించడంతో పాటు ఎన్ఎంఎంఎస్ లోనూ ప్రతిభ చూపడం హర్షణీయమన్నారు. పలు జిల్లా స్థాయి పోటీల్లో పాఠశాల విద్యార్థులు అగ్రస్థానంలో నిలవడం పట్ల, వారి విజయసాధనలో అంకితభావంతో పనిచేసినా ప్రధానోపాధ్యాయురాలు మనోహరమ్మ కృషి ఉందన్నారు. అనంతరం గ్రామస్తులు, ఉపాధ్యాయులు కలిసి ప్రధానోపాధ్యాయురాలు మనోహరమ్మను పూలమాలలు, శాలువతో సన్మానించారు.

చంద్రబాబుకు ముక్కంటి ప్రసాదాలు



శ్రీకాళహస్తి, జులై 26: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి శ్రీకాళహస్తి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, టీడీపీ సీనియర్ నాయకులు రంగినేని చెంచయ్య నాయుడు ముక్కంటి ప్రసాదాలు అందజేశారు. శుక్రవారం విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబును ఆయన సీఎం క్యాంప్ ఆఫీస్ వద్ద ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డితో పాటు చెంచయ్య నాయుడు కలిసి ముక్కంటి ప్రసాదాలను అందజేశారు.

వేడుకగా పద్మావతమ్మ ఊయలసేవ

నారాయణవనం, జులై 26: స్థానిక కల్యాణ వెంకన్న ఆలయంలో పద్మావతి అమ్మవారి ఊయల సేవను వేడుకగా నిర్వహించారు. ఉదయం స్వామి, పద్మావతి అమ్మవార్లకు నిత్య కైంకర్యాలు నిర్వహించి, ప్రత్యేక అభిషేకాలు చేశారు. సాయంత్రం అమ్మవారికి నూతన పట్టువస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో అలంకరించి, వేద పండితుల మంత్రోచ్చారణతో ఊంజలసేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర్ భట్టాచార్య, శ్రీనివాసరాఘవ భట్టాచార్య, ఆలయాధికారి నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారుల తీరు మారకుంటే ప్రభుత్వానికి ఫిర్యాదు

● టీడీపీ నేతల హెచ్చరిక


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సంచి కృష్ణయ్య

పెళ్లకూరు, జూలై 26: కొందరు అధికారుల తీరు.. కొందరు అక్రమార్కుల విధానాలతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని కొత్తూరులో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మండలంలో అవినీతి, అక్రమాలను అరికట్టేందుకు అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని కోరారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారినా.. మండలంలో అధికారుల తీరులో మార్పు రాలేదన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అక్రమార్కులతో కుమ్మక్కై అవినీతికి పాల్పడిన విధానాలను ఇంకా కొనసాగిస్తునరన్నారు. రెవెన్యూ, పోలీసు అధికారుల తీరు బాధాకరంగా ఉందన్నారు. ఇప్పటికైన వీరి తీరు మార్చుకోక పోతే సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి రాత పూర్వకంగా ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణాను అరికట్టేందుకు పోలీస్, రెవెన్యూ, మైనింగ్ అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి వి.శేఖర్‌నాయుడు, టీడీపీ సీనియర్ నేత డి.ప్రసాద్‌నాయుడు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో ఎలాంటి అవినీతి, అక్రమాలు జరగడానికి వీలు లేదన్నారు. రెవెన్యూ అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరించకుండా రైతులు, సామన్య ప్రజలు, విద్యార్థుల అవసరాలను తీర్చాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతికి స్వస్తి పలకాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మురళీనాయుడు, రవి, పరుశురాం, సురేష్, కృష్ణమనాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యానగర్‌లో విజయ్ దివస్ ర్యాలీ



విద్యానగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

కోట, జూలై 26: మండలంలోని విద్యానగర్‌లో ఎన్‌బీకేఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్ల ఆధ్వర్యంలో కార్గిల్ యుద్ధ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ శుక్రవారం విజయ్ దివస్ ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీని కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. 25 సంవత్సరాల క్రితం కార్గిల్‌లో భారత సైనికులు వీరోచితంగా పోరాడి పాకిస్తాన్‌ను ఓడించారని విజయకుమార్‌రెడ్డి చెప్పారు. ఈ పోరాటంలో 527మంది భారత సైనికులు అమరులయ్యారని వారి కుటుంబాలకు రుణపడి ఉంటూ వారి త్యాగాలను స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఇంజినీరింగ్ కళాశాల నుంచి విద్యానగర్ గాంధీబొమ్మ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఎన్‌సీసీ అధికారులు మాధవయ్య, మల్లికార్జున్‌రెడ్డి, శోభారాణి పాల్గొన్నారు.

ఆ నేరస్తుల చిట్టా బయటకు తీయండి

తిరుపతి(నేరవిభాగం), జూలై 26: ఐదేళ్ల కాలంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు, హత్యలు, హత్నాయత్నాలకు పాల్పడిన వారి జాబితాను ప్రభుత్వానికి పంపాలని ఎస్పీకి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. దీంతో సబ్ డివిజన్ల వారీగా సర్కిల్ కార్యాలయాల నుంచి వివరాలు సేకరించే పనిలో పోలీసులున్నారు. మరోవైపు ఐదేళ్ల కాలంలో వైసీపీ నాయకులు తప్పులు చేసినా.. ఎక్కడా కేసులు నమోదు చేసిన దాఖలాలు లేవు. ప్రధానంగా శ్రీకాళహస్తి, చంద్రగిరి, నాయుడుపేట, సత్యవేడు, గూడూరు, తిరుపతి పరిధిలోని చాలా ప్రాంతాల్లో వైసీపీ శ్రేణులు రెచ్చిపోయి.. విధ్వంసాలకు పాల్పడ్డారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వారం రోజుల తర్వాత ఎంఆర్‌పల్లె సర్కిల్‌లో తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు రవినాయుడు, ఆనందగౌడ్ ఆధ్వర్యంలో సంబరాలు చేసి, బాణసంచా కాల్చి ర్యాలీ నిర్వహించారు. దీనిపై ఎస్పీ ఆదేశాలతో తెలుగు యువత నాయకులపై ఎస్వీయూ పోలీసులు కేసులు నమోదు చేశారు. దీనిపై ఉన్నతాధికారులు సీరియస్‌గా స్పందించిన విషయం విదితమే. మరోవైపు మొన్న జరిగిన సార్వత్రిక ఎన్నికల సమయంలో కొంతమంది టీడీపీ నాయకులపై పోలీసులు తప్పుడు కేసులు నమోదు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. వీటన్నింటిపైనా సమగ్ర జాబితా తయారు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

10 మంది 'ఎర్ర'స్మగ్లర్ల అరెస్టు

ఆరు దుంగలు, రెండు కార్లు స్వాధీనం


స్మగ్లర్ల వివరాలు తెలియజేస్తున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

మంగళం, జూలై 26: టాస్క్‌ఫోర్స్ పోలీసులు పది మంది ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి ఆరు దుంగలు, రెండు కార్లు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జి, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాలతో టాస్క్‌ఫోర్స్ ఎస్పీ పి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్ఐ కె.కృపానంద, ఆర్ఎస్ఐ కె.సురేష్ బాబుకు చెందిన బృందం దొరవారిసత్రం-నాయుడుపేట అటవీ ప్రాంతంవైపు శుక్రవారం కూంబింగ్ చేపట్టారు. అక్కడినుంచి సూళ్లూరుపేట బీటు పరిధిలోని తల్లంపాడు గ్రామం సమీపంలో ఉన్న జాతీయ రహదారిలో వాహనాల తనిఖీ నిర్వహించారు. అటువైపు వచ్చిన రెండు కార్లు వీరిని చూసి కొద్దిదూరంలోనే ఆపేసి, అందులోని వారు పారిపోయే ప్రయత్నం చేశారు. గమనించిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు వెంబడించి పది మంది పట్టుకున్నారు. వీరు.. తమిళనాడు వేలూరు జిల్లా ఆనైకట్టుకు చెందిన రాజమణి గోవిందస్వామి(41), విజయకుమార్(32), శివకుమార్ వెల్లియన్ (26), కుమార్ ముత్తు(29), అరుల్ ముత్తుస్వామి(23), ప్రభురాజ్(25), అశోక్ కుమార్ (29), ఎం.గోపి (26), జ్ఞానశేఖర్ చిన్నతంబి (19), పూవరాసన్ వరదన్(27)గా గుర్తించారు. పరారైన మిగిలిన వారికోసం గాలిస్తున్నారు. ఆరు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, వాహనాలను సీజ్ చేశారు. సీఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఇన్‌స్పైర్ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(విద్య), జూలై 26: ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో ఆరునుంచి పది తరగతులు చదివే విద్యార్థులు ఇన్‌స్పైర్ అవార్డులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీఈవో డాక్టర్ వి.శేఖర్ సూచించారు. దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్లను శుక్రవారం జిల్లాసైన్స్ అధికారి భానుప్రసాద్, అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ శివశంకరయ్య, కమ్యూనిటీ మొబలైజేషన్ ఆఫీసర్ సురేష్‌తో కలసి ఆవిష్కరించారు. శేఖర్ మాట్లాడుతూ.. కేంద్రశాస్త్ర సాంకేతిక మండలి, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే ఇన్‌స్పైర్‌కి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. సెప్టెంబరు 15వ తేదీవరకు దరఖాస్తుకు అవకాశం ఉందని తెలిపారు. అప్పర్ ప్రైమరీ పాఠశాల నుంచి 3, హైస్కూల్ నుంచి 5చొప్పున ఇన్‌స్పైర్‌కి నామినేషన్లు చేయాలని, ఇతర వివరాలకు జిల్లాసైన్స్ అధికారి ఫోన్‌నెంబరు 94405 11983ని సంప్రదించాలని కోరారు. సమగ్ర శిక్ష అధికారులు పాల్గొన్నారు.

సెల్ఫ్ సపోర్టింగ్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 26: ఎస్వీయూ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ సెల్ఫ్ సపోర్టింగ్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానించారు. ఆగస్టు 2వ తేదీ దరఖాస్తుకు చివరి గడువుగా విధించినట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు తెలిపారు. సమగ్ర సమాచారం కోసం.. ఎస్వీయూనివర్శిటీ.ఎడ్యూ.ఇన్.డీవోఏ.. వెబ్‌సైట్ చూడాలని శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో కోరారు.

ఇసుక అక్రమ రవాణాపై దృష్టి పెట్టాలి

ఎడ్లబండిపై తరలించినా జరిమానా విధించండి: కలెక్టర్


జిల్లా అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), జూలై 26: జిల్లాలో ఇసుక అక్రమ రవాణాపై దృష్టి పెట్టాలని జిల్లా యంత్రాంగాన్ని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. శుక్రవారం రాత్రి అమరావతి నుంచి నూతన ఇసుక పంపిణీపై భూగర్భ గనులశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ముకేష్‌కుమార్ మీనా వర్చువల్ విధానంలో జిల్లా అధికారులతో సమీక్షించారు. ఎస్పీ సుబ్బరాయుడితో కలిసి కలెక్టర్ హాజరయ్యారు. వీసీ తర్వాత అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడారు. నూతన ఇసుక విధానం అమలుకు ఏర్పాటైన జిల్లాస్థాయి కమిటీలోని సభ్యులందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నియోజకవర్గ, మండల స్థాయి కమిటీలు కూడా సమర్థవంతంగా పనిచేయాలన్నారు. అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పటిష్ఠ నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. ఎడ్లబండిపై అక్రమంగా ఇసుక రవాణా చేసినా జరిమానా విధించాలని ఆదేశించారు. డీఆర్వో పెంచలకిషోర్, అడిషనల్ ఎస్పీ వెంకట్రావు, సెబ్ అదనపు ఎస్పీ రాజేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్‌ని బెదిరించిన వారిపై కేసులు పెట్టండి

తిరుపతి(ఆటోనగర్), జూలై 26: బాలాయపల్లి మండలం సుబ్రమణ్యం గ్రామంలోని పీహెచ్‌సీలో గురువారం డాక్టర్‌ని బెదిరించిన టీడీపీ నాయకులపై కేసులు నమోదు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి డిమాండ్ చేశారు. దౌర్జన్యం చేయడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. ఉద్యోగులను వేధించడం మానుకోని పక్షంలో తాము ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

ఎమ్మెల్యే చొరవతో రేణిగుంటకు తాగునీరు


మోటరు ఆన్ చేస్తున్న టీడీపీ నాయకులు

రేణిగుంట జూలై 26: శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి చొరవతో రేణిగుంట పంచాయతీకి తాగునీరు అందింది. దాదాపు నెల రోజులుగా రేణిగుంట పంచాయతీలోని పలు వార్డుల్లో నీటి ఎద్దడి నెలకొనడంతో స్థానిక టీడీపీ నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే ఆదేశాలతో శుక్రవారం తెలుగుగంగ నీరు రేణిగుంట పంచాయతీకి చేరుకుంది. టీడీపీ నాయకులు పంప్‌హౌస్‌కు చేరుకుని మోటర్ స్విచ్‌ని ఆన్‌చేసి నీటిని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విష్ణు చిరంజీవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పవన్, టీడీపీ నాయకులు చంద్రారెడ్డి మహబూబ్ బాషా, పుష్పనాథన్, నాదమునిరెడ్డి, కన్నన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీర జవాన్ల త్యాగాలు చిరస్మరణీయం



శ్రీకాళహస్తి, జూలై 26: కార్గిల్ యుద్ధంలో దేశం కోసం ప్రాణాలర్పించిన వీర జవాన్ల త్యాగాలు ఎప్పటికీ చిరస్మరణీయమని శ్రీకాళహస్తి పురపాలక సంఘం కమిషనర్ రమేష్ బాబు అన్నారు. పట్టణంలోని కార్గిల్ సెంటర్ వద్ద శుక్రవారం మాజీ సైనికుడు పులి శ్రీకాంత్ ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్ నిర్వహించారు. వీర జవానులకు నివాళులర్పించారు. మాజీ సైనికులు వెంకటేశ్వరరావు, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చెంచులక్ష్మి కల్యాణోత్సవం





రేణిగుంట జూలై 26: మండలంలోని కరకంబాడి పంచాయతీ చింతకోన వీధిలో వెలసిన నరసింహస్వామి సమేత చెంచులక్ష్మి ఆలయంలో శుక్రవారం కల్యాణోత్సవం నిర్వహించారు. ఆలయం నిర్మించి ఆరు సంవత్సరాలు పూర్తి కావడంతో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు బుజ్జి నాయుడు, సభ్యుల నేతృత్వంలో వార్షికోత్సవం నిర్వహించారు.స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేసి, అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం వెలుపల నరసింహస్వామి, చెంచులక్ష్మి కల్యాణం నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు హాజరై స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.

ఏపీ పాలిసెట్‌కు 31న స్పాట్ అడ్మిషన్లు

గూడూరు అర్బన్, జూలై 26: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మిగిలివున్న సీట్లకు స్పాట్ అడ్మిషన్ విధానం ద్వారా భర్తీ చేయనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రవికృష్ణ శుక్రవారం తెలిపారు. పాలిసెట్ అర్హతలేని, ఓపెన్‌స్కూల్ చదవిన విద్యార్థులు ఈనెల 27 నుంచి 31వ తేదీ వరకు కళాశాలలో సంప్రదించాలన్నారు. సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, మైనింగ్ బ్రాంచ్‌లు ఉన్నాయన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు వివరాలకు ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలన్నారు. అదేవిధంగా స్థానిక ప్రభుత్వ సిరామిక్ కళాశాలలో ఈనెల 31వ తేదీ స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. పదో తరగతి విద్యాహర్హత కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని తెలిపారు.

ఇలాగైతే పూర్తయ్యేదెప్పుడు?

నత్తనడకన 'చెన్నై - తిరుపతి బైపాస్ రైలు మార్గం' పనులు ● 'రెవెన్యూ' చొరవ లేకపోవడమే కారణమంటున్న రైల్వే వర్గాలు



రేణిగుంట వద్ద జరుగుతున్న బైపాస్ రైలు మార్గం పనులు - రైలు మార్గం మ్యాప్

తిరుపతి(సెంట్రల్), జూలై 26: రేణిగుంట సంతగేటు వద్ద జరుగుతున్న చెన్నై- తిరుపతి బైపాస్ రైలు మార్గం పనులు నత్తనడకన సాగుతున్నాయి. రెవెన్యూ అధికారులు తగిన చొరవ చూపక పోవడమే దీనికి కారణమని రైల్వే వర్గాలు అంటున్నాయి. రేణిగుంట రైల్వేస్టేషన్‌పై రైళ్ల రద్దీ తగ్గించి, సమయాన్ని ఆదా చేయడానికి దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఈ బైపాస్ రైలు మార్గం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ పనులను 2023 ఏప్రిల్‌లో ప్రారంభించారు. దీనికోసం రూ.22కోట్లు మంజూరయ్యాయి. ఇందులో రూ.4.30కోట్లు భూసేకరణకు, రూ.17.70 కోట్లు రైలు మార్గం పూర్తి చేయడానికి కేటాయించారు. గత ఏడాది నుంచి పనులు జరుగుతున్నాయి. భూసేకరణకు సంబంధించిన మొత్తాన్ని రాష్ట్ర రెవెన్యూ శాఖకు రైల్వే అధికారులు చెల్లించారు. అయితే భూసేకరణ చేయడంలో రెవెన్యూ అధికారులు ప్రారంభంలో చూపిన చొరవ.. రోజులు గడిచేకొద్దీ చూపడం లేదన్న విమర్శలున్నాయి.

ఏం జరిగిందంటే..

భూసేకరణలో భాగంగా రేణిగుంట మండలంలోని నక్కల కాలనీ, గాంధీనగర్‌లోని 53 నివాస గృహాల యజమానులు నిరాశ్రయులవుతారు. వీరికి నష్టపరిహారం చెల్లించి, ప్రత్యామ్నాయంగా ఇంటి స్థలం ఇవ్వాలని క్షేత్రస్థాయి అధికారులు ప్రభుత్వానికి నివేదికలు పంపారు. నిరాశ్రయుల్లోని కొందరు షికారీలు మాత్రం తమకు ఇక్కడే ఇంటి స్థలాలు కావాలని పట్టుబడుతున్నారు. ఈ సమస్యను గత వైసీపీ ప్రభుత్వంలో పరిష్కరించలేదు. దీనివల్ల డిసెంబరు నెలాఖరుకు పూర్తి కావాల్సిన బైపాస్ రైలుమార్గం మరో ఏడాది పట్టే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వమైనా స్పందించి భూసేకరణ పూర్తి చేసి.. రైల్వే అధికారులకు సహకరించాల్సిన అవసరం ఉంది.

నడిరోడ్డుపై మందుబాబు వీరంగం

పోలీసుల ప్రేక్షక పాత్ర ● విస్తుపోయిన ప్రజలు



నడిరోడ్డుపై అడ్డంగా పడుకున్న మందుబాబు

శ్రీకాళహస్తి, జూలై 26: రద్దీ రోడ్డుపై పడుకుని ఓ మందుబాబు వీరంగం చేసిన ఘటన గురువారం రాత్రి శ్రీకాళహస్తి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో జరిగింది. బస్టాండు సమీపంలోని పీవీ రోడ్డు నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. గురువారం అర్ధరాత్రి వేళ గుర్తు తెలియని యువకుడు నడిరోడ్డుపై పడుకుని వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగించాడు. చాలాసేపు వాహనాలు స్తంభించిపోవడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇద్దరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. వారిని గమనించిన తాగుబోతు పైకి లేచి అక్కడే ఉన్న ఓ స్థానిక యువకుడిపై విరుచుకుపడి పిడుగుద్దులు కురిపించాడు. అసలు ఏం జరుగుతుందో అర్థం కాక స్థానికులు ఆశ్చర్యానికి గురయ్యారు. మద్యం మత్తులో యువకుడు రెచ్చిపోతున్నప్పటికీ అక్కడే ఉన్న ఇద్దరు కానిస్టేబుళ్లు కనీసం అడ్డుకునే ప్రయత్నం కూడా చేయలేదు. ఇంతలో ఆ తాగుబోతు అక్కడ నుంచి పారిపోయాడు. పోలీసులూ అక్కడి నుంచి వెళ్లిపోయారు. మద్యం మత్తులో యువకుడు రోడ్డుపై పడుకుని ట్రాఫిక్ స్తంభింపజేయడమే కాకుండా స్థానికులతో గొడవ చేస్తుంటే పోలీసులు ప్రేక్షకపాత్ర పోషించడం పట్ల ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమయ్యాయి.

భూసమస్యలు పరిష్కరించండి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 26: మండలంలో భూ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం, వ్యవసాయ కార్మిక సంఘం, ఏపీ రైతు సంఘాల ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగారాజు మాట్లాడుతూ మండలంలో భూ సమస్యలు పరిష్కరించకుండా అధికారులు కాలయాపన చేస్తున్నారని తెలిపారు. కుక్కంబాకం రెవెన్యూలో సర్వే నెంబర్లు 81లో 82 ఎకరాలను స్థానికేతురులు కబ్జా చేయాలని చూస్తుంటే అధికారులు వారికి సహకరిస్తున్నారని ఆరోపించారు. గాజులపెళ్లూరు రెవెన్యూలో ఉన్న గొర్రెపూడి భూములను స్థానిక గిరిజనులకు పంపిణీ చేయాలపి డిమాండ్ చేశారు. అలాగే కాటూరు రెవెన్యూలో సర్వే నెంబరు 29లో 9ఎకరాలు భూమిని దళితులకు పట్టాలు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం ఏరియా కార్యదర్శి దాసరి జనార్దన్, వ్యసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రమణయ్య, నాయకులు బాలగురువయ్య, తిరుపాలయ్య, జేకే రమణయ్య, సుబ్బయ్య, కృష్ణమ్మ, మల్లెమ్మ, పద్మ, పూలరాణి పాల్గొన్నారు.

శాకాంబరిగా దక్షిణ కాళికాదేవి

శ్రీకాళహస్తి, జూలై 26: శ్రీకాళహస్తి మండలం వేడాం గ్రామంలో వెలసిన దక్షిణ కాళికాదేవికి ఆషాడ మాసం శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం రాహు కాలం సమయంలో అర్చకులు అమ్మ వారి మూలమూర్తిని పూజా ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం వివిధ కూరగాయాలతో శాకాంబరిగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు దీపాలు వెలిగించి హారతులు పట్టారు. అలయ నిర్వాహకలు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం దాతలు అన్నదానం చేశారు.



కూరగాయాల అలంకారంలో దక్షిణకాళికాదేవి

శ్రీకాళహస్తి
సత్యవేడు

సచివాలయంలో డీఎల్‌పీవో తనిఖీలు

ఏర్పేడు, జూలై 26: ఏర్పేడు మండలంలోని ఎండీ పుత్తూరు గ్రామ సచివాలయాన్ని డీఎల్‌పీవో ప్రభురెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. ముందుగా గ్రామంలోని పారిశుధ్యాన్ని పరిశీలించారు. వీధిలైట్లు, తాగునీటి సదుపాయాలు తదితర అంశాల గురించి గ్రామస్తులను అడిగి తెలుసుకొన్నారు. అనంతరం సచివాలయంలో రికార్డులను పరిశీలించి సచివాలయ సిబ్బంది పనితీరు గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లోకముని, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సూర్యప్రభపై కుమారస్వామి చిద్విలాసం



శ్రీకాళహస్తి, జూలై 26: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా విజ్ఞానగిరిపై వెలసిన శ్రీవల్లీ, దేవసేన సమేత కుమారస్వామి శుక్రవారం సూర్యప్రభ వాహనంపై ఊరేగారు. ఆలయంలోని అలంకార మండపంలో స్వామి అమ్మవార్లకు పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించి ధూపదీప, నైవేద్యాలు సమర్పించారు. వేదమంత్రాలు, మంగళవాయి ద్యాలు, మేళ తాళాల నడుమ స్వామి అమ్మవార్లను సూర్యప్రభ వాహనంపై అధిష్టించారు. పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి అమ్మవార్లను భక్తులు దర్శించుకుని కర్పూర నీరాజనాలు సమర్పించారు. శ్రీవల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి శుక్రవారం రాత్రి పురవిహారం చేశారు.

ఆడికృత్తిక ఏర్పాట్ల పరిశీలన

శ్రీకాళహస్తి, జూలై 26: ఆడికృత్తిక ఉత్సవాల ఏర్పాట్లను ముక్కంటి అలయ డిప్యూటీ ఈవో కృష్ణారెడ్డి అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ముక్కంటి ఆలయానికి అనుబంధంగా పట్టణంలోని విజ్ఞానగిరిపై వెలసిన కుమారస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతున్న విషయం తెలిసిందే. భక్తుల రద్దీ దృష్ట్యా అవసరమైన క్యూలైన్లు, పందిళ్లు, మెట్ల మార్గాలు, కల్యాణ కట్ట, తెప్పోత్సవానికి నారద పుష్కరిణి ముస్తాబు ఏర్పాట్లు పరిశీలించారు. ఇంజనీరింగ్ శాఖ అధికారులకు పలు అంశాలపై సూచనలు చేశారు.

మాతా శిశు సంరక్షణే ధ్యేయం

శ్రీకాళహస్తి, జులై 26: మాతా శిశు సంరక్షణే ధ్యేయంగా వైద్య సిబ్బంది పని చేయాలని జిల్లా టాస్క్‌ఫోర్స్ ప్రధాన అధికారి డాక్టర్ శ్రీనివాసరావు అన్నారు. శ్రీకాళహస్తి మండలంలోని పోలి విలేజ్ క్లినిక్‌ను టాస్క్‌ఫోర్స్ అధికారుల బృందం శుక్రవారం పరిశీలించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, పిల్లలు రక్తహీనతతో ఇబ్బందులు పడకూడదని సూచించారు. రక్తహీనత సమస్యను అధిగమించేందుకు క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ప్రతి కాన్పు ప్రభుత్వాస్పత్రిలోనే జరిగేలా క్షేత్రస్థాయి వైద్య సిబ్బంది పనిచేయాలని సూచించారు. పౌష్టిక ఆహారాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మకు విశేష పూజలు

శ్రీకాళహస్తి, జూలై 26: ముక్కంటి ఆలయానికి అనుబంధంగా కనకాచలంపై వెలసిన కనకదుర్గమ్మకు శుక్రవార తై అమావాస్యను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాహుకాలం సమయంలో అమ్మవారి మూలమూర్తికి వివిధ పూజా ద్రవ్యాలతో విశేషంగా అభిషేకాలు చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో అమ్మవారికి దీపారాధన సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే సామూహిక లలితా సహస్ర నామం పఠించారు. అనంతరం అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

ఉపాధ్యాయుల బోధన అర్థం కావడంలేదు!

సకాలంలో భోజనం పెట్టరు, తాగునీళ్లూ లేవు ● ఏకలవ్య గురుకులం విద్యార్థుల ఆవేదన





విద్యార్థులను విచారిస్తున్న అధికారులు - పనిచేయని ఆర్‌వో ప్లాంట్

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 26: మండలంలోని కనమనంబేడు గ్రామంలో ఉన్న ఏకలవ్య గురుకుల పాఠశాలను ఎంపీడీవో త్రివిక్రమ్, ఎంఈవోలు రవీంద్రనాథ్, మునిసుబ్రహ్మణ్యం, వైద్యాధికారి దివాకర్ శుక్రవారం సందర్శించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టకపోవడం, నాసిరకం కూరగాయల వినియోగం, కుళ్లిపోయిన అరటి పండ్లు, స్నానపు గదుల్లో శుభ్రత లేకపోవడం, తాగునీటి కొరత, పాఠశాలలో ఎక్కడి చెత్త అక్కడే ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులను విచారించగా పలు విషయాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తమకు మెనూ ప్రకారం భోజన పెట్టడం లేదని, ప్రతి రోజూ పప్పు మాత్రమే ఇస్తున్నారని, చిక్కీలు, అరటి పండ్లు సక్రమంగా ఇవ్వడం లేదని తెలిపారు. విద్యార్థినులకు న్యాప్‌కిన్‌లు పంపిణీ చేయడం లేదని, మరుగు దొడ్లలో శుభ్రత లేక దుర్గంధం వెలువడుతోందని వివరించారు. అంతేకాకుండా వంటకు వాడే స్టీమ్‌లు పనిచేయ కపోవడంతో విద్యార్థులకు సకాలంలో భోజనాలు అందడం లేదని చెప్పారు. ఆర్‌వో ప్లాంట్ పనిచేయక పోవడంతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. అంతేకాక ప్రిన్సిపాల్‌తో పాటు బోధనా సిబ్బంది ఉత్తరప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు చెందిన వారు కావడంతో వాళ్ల బోధన తమకు అర్థకావడం లేదని విద్యార్థులు వాపోయారు. పాఠశాలలో సమస్యలపై పూర్తి స్థాయి నివేదికను సంబంధిత ఉన్నతాధికారులకు పంపనున్నట్లు ఎంపీడీవో, ఎంఈవోలు చెప్పారు.

నైపుణ్యాభివృద్ధితో మెరుగైన ఉద్యోగ అవకాశాలు

శ్రీకాళహస్తి, జూలై 26: నైపుణ్యాభివృద్ధితో మెరుగైన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని స్కిమ్స్ కళాశాల కరస్పాండెంట్ మిద్దెల హరి అన్నారు. శ్రీకాళహస్తి మండలం కాపుగునేరు వద్ద ఉన్న కళాశాలలో శుక్రవారం ఫేర్వెల్ డే వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిధిగా విచ్చేసిన మిద్దెల హరి, బెంగళూరుకు చెందిన ట్రైనింగ్ అండ్ డెవలప్మెంట్ మేనేజర్ నవీన్ కవల్ జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా మిద్దెల హరి మాట్లాడుతూ... శ్రీకాళహస్తి పరిసర ప్రాంతాలు పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని, నైపుణ్యం సాధించిన విద్యార్థులకు స్థానికంగా మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయన్నారు. నవీన్ కవల్ మాట్లాడుతూ... ప్రస్తుత ఆధునిక సమాజంలో అవసరమైన కీలక నైపుణ్యాలను సాధించేందుకు అందుబాటులో ఉన్న మార్గాలను వివరించారు. అనంతరం విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ రఘురామిరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ గీతాదేవి, డైరెక్టర్ శ్రీకుమార్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న మిద్దెల హరి

వేతన వివాదంపై డీవైఈవో విచారణ

సత్యవేడు, జూలై 26: సత్యవేడు మండలంలోని దాసుకుప్పం జడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం పుత్తూరు డీవైఈవో ప్రభాకర్‌రాజు విచారణ జరిపారు. హెచ్‌ఎం జ్యోతి ఈ ఏడాది ఫిబ్రవరి నెలకు సంబంధించిన వేతన బిల్లును బ్యాంకు ఖాతాలో జమ చేయకుండా తమ పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని ఉపాధ్యాయులు ఆరోపణలు చేసిన విషయమై పలు దిన పత్రికల్లో వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో డీవైఈవో శేఖర్ పాఠశాలకు చేరుకుని హెచ్‌ఎం జ్యోతితో పాటు, ఉపాధ్యాయులను వేర్వేరుగా విచారించారు. విచారణలో ఇటీవల జరిగిన హెచ్‌ఎం జ్యోతి సస్పెన్షన్‌కు తామే కారణమంటూ తమ పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తూ, ప్రతి విషయంలోనూ తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఉపాధ్యాయులు డీవైఈవో ఎదుట వాపోయారు. ఈ కారణంగా ఫిబ్రవరి నెలకు సంబంధించిన వేతన బిల్లును హెచ్‌ఎం తమ ఖాతాకు జమచేయలేదని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. మరోవైపు హెచ్‌ఎం జ్యోతి డీవైఈవోకు వివరణ ఇస్తూ పాఠశాలలో ఉపాధ్యాయులందరూ ఏకమై తనను వేధింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయుల వివరణను రికార్డు చేసుకున్న డీవైఈవో విచారణ నివేదికను ఆర్జేడీ అధికారులకు పంపనున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా ఉపాధ్యాయులకు అందాల్సిన ఫిబ్రవరి వేతన బిల్లును ట్రెజరీకి పంపాలని హెచ్‌ఎం జ్యోతిని డీవైఈవో ఆదేశించారు. అయితే సస్పెన్షన్ కాలంలో తనకు ఒకనెల వేతనం అందలేదని, తనకు న్యాయం జరిగే వరకు ఉపాధ్యాయులకు కూడా బిల్లు పెట్టేదిలేదని హెచ్‌ఎం తెగేసి చెప్పడంతో డీవైఈవో అవాక్కయ్యారు. హెచ్‌ఎంకు డీవైఈవో ఎంత నచ్చచెప్పిన ఆమె ససేమిరా అనడంతో ఆయన వెనుదిరిగారు.

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా వుండండి

కేవీబీపురం, జూలై 26: వాతావరణంలో మార్పులు కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని, ప్రజలు జాగ్రత్తగా వుండాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వాణి చెప్పారు. శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆమె సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.భోజనానికి ముందు, తరువాత చేతులను శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలని విద్యార్థులకు సూచించారు.

విద్యా సామగ్రి పంపిణీ

రేణిగుంట జూలై 26: రేణిగుంట మండలం గురురాజుపల్లి యానాది కాలనీలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆశ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యా సామగ్రిని శుక్రవారం పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షుడు జులియన్‌రాజు, శివ శంకర్, శ్రీధర్, దేవి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

వరదయ్యపాళెం, జూలై 26: కంటి సమస్యతో బాధ పడుతూ వైద్యంకోసం ఎదురు చూస్తున్న వరదయ్యపాళెం హైస్కూల్ గిరిజన కాలనీకి చెందిన చిన్నారి సోహిత్ (5)కు సత్యవేడు మండలం రాజగోపాలపురానికి చెందిన టీడీపీ నాయకుడు, ప్రముఖ ఆడిటర్ రోశయ్య రూ.ఐదువేల అందించారు.

శుక్రవార ఉత్సవం

శ్రీకాళహస్తి, జూలై 26: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారాన్ని పురస్కరించుకుని అమ్మవారికి విశేష ఉత్సవం నిర్వహించారు. అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయంలో ప్రాకారంగా ప్రదక్షిణ చేసి తిరిగి కొలువుతీర్చారు.

పుత్తూరు వార్తలు


డిప్యూటీ సీఎం దృష్టికి గ్రామీణప్రాంతాల సమస్యలు



డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, జూలై 26: ఉప ముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి నగరి నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల సమస్యలను ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ తీసుకెళ్లారు. శుక్రవారం అసెంబ్లీలో పవన్ కళ్యాణ్‌ను కలిసిన ఎమ్మెల్యే ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా భానుప్రకాష్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని పంచాయతీ రాజ్‌కు సంబంధించిన రోడ్లు దారుణంగా ఉన్నాయని, వాటి మరమ్మతులకు నిధులు కేటాయించాలని కోరారు. అలాగే గ్రామీణాభివృద్ధిలో భాగంగా గ్రామీల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు కూడా నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. సమస్యలను సావధానంగా విన్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎమ్మెల్యే వినతులను త్వరలోనే పరిష్కరించి నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

కార్గిల్ అమరవీరులకు నివాళి



అమరవీరులకు నివాళులర్పిస్తున్న అధ్యాపకులు


పుత్తూరు అర్బన్, జూలై 26: కార్గిల్ యుద్ధంలో అసువులు బాసిన వీర జవాన్లకు శుక్రవారం వేదవ్యాస విద్యా సంస్థల అధ్యాపకులు నివాళులర్పించారు. పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి అమర వీరుల జ్ఞాపకార్థం కొవ్వొత్తులు వెలిగించి జవాన్ల ధైర్యసాహ సాలను గుర్తుచేసు కున్నారు. ఈ సందర్భంగా ఎస్వీయూ సెనేట్ మెంబర్ సి.నారాయణబాబు మాట్లాడుతూ దేశ రక్షణలో వీరమరణం పొందిన ప్రతి జవాను అమరుడేనన్నారు. వారి త్యాగాలను దేశం ఎప్పటికీ గుర్తించుకుంటుందని, దేశం కోసం జవాన్లు ప్రాణాలను సైతం లెక్క చేయకుండా చేసిన పోరాట పటిమను చిన్నతనం నుంచే విద్యార్థుల్లో స్ఫూర్తిగా నింపడం ప్రతి ఒక్కరి కర్తవ్యమన్నారు. కార్గిల్ యుద్ధంలో అమరులైన జవాన్ల జ్ఞాపకార్థం ప్రతి ఏడాది కార్గిల్ విజయ్ దివస్‌ను జరుపుకుంటున్నట్లు ఆయన గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ వేదవ్యాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ ఓసీ ఉద్యోగుల సంఘ కార్యవర్గం

పుత్తూరు, జూలై 26: పుత్తూరు విద్యుత్ డివిజన్ ఓసీ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. అధ్యక్షుడిగా రవిచంద్ర నాయుడు, కార్యదర్శిగా దిలీప్, కోశాధికారిగా సదాశివరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాలకృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడిగా గురవయ్యశెట్టి, సంయుక్త కార్యదర్శిగా గోపి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ప్రాంతీయ అధ్యక్షుడు చంద్రమౌళి, డిస్కమ్ అధ్యక్షుడు సతీష్, ఉపాధ్యక్షుడు శేషారెడ్డి పాల్గొన్నారు.

మీ అబ్బాయి మా కస్టడీలో ఉన్నాడు

● తల్లిదండ్రులకు ఫేక్ వాట్సప్ కాల్స్
● నమ్మిమోసపోవద్దని నిపుణుల యాచన



పుత్తూరు అర్బన్, జూలై 26: మీ అబ్బాయి మా కస్టడీలో ఉన్నాడు... జైలుకు పంపకుండా ఉండాలంటే ఖర్చు అవుతుంది. త్వరగా నిర్ణయం తీసుకోండి... అంటూ పోలీసులమని చెప్పుకునే వ్యక్తులు కుటుంబసభ్యులకు వాట్సప్ కాల్స్ చేసిన సంఘటన పుత్తూరులో జరిగింది. పట్టణానికి చెందిన ఎలక్ట్రానిక్ మీడియా సీనియర్ జర్నలిస్ట్ ఈ.ఆనంద్‌కు ఒక కుమార్తె ఉంది. ఆమె ఐటీ ప్రొఫెషనల్‌గా బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తోంది. శుక్రవారం మధ్యాహ్నం ఆనంద్‌కు ఓ వాట్సప్ కాల్ వచ్చింది. అందులోని ప్రొఫైల్ పిక్‌లో పోలీస్ అధికారి ఫొటో కూడా ఉంది. ఫోన్ చేసిన వ్యక్తి ఇంగ్లీష్, హిందీ భాషలో ఆనంద్‌తో మాట్లాడాడు. తనను తాను పోలీస్ అధికారిగా పరిచయం చేసుకుంటూ మీ అబ్బాయి బెంగళూరులో మా కస్టడీలో ఉన్నాడు. ఒక రేప్ కేసులో అరెస్ట్ చేశాం. జైలుకి పంపకుండా ఉండాలంటే కొంత మొత్తం అర్జంట్‌గా మేము చెప్పిన బ్యాంకు ఖాతాకు పంపండి. లేకుంటే మీ అబ్బాయి పరిస్థితి ఊహించుకోలేరు అనేది సారాంశం. అయితే ఆనంద్‌కు కుమారులు ఎవరూ లేకపోవడంతో ఆ విషయాన్ని బయటపెట్టకుండా... 'పర్వాలేదు తప్పు చేసి ఉంటే జైలుకు పంపండి... ఏదైనా ఉంటే మా లోకల్ పోలీసులకు సమాచారం ఇవ్వండి అప్పుడు మేము ఆలోచిస్తాం... ఫోన్ చేసి విసిగిస్తే మీపైన సైబర్ క్రైంకు కంప్లైంట్ ఇవ్వాల్సి ఉంటుందని హెచ్చరించడంతో అవతల వ్యక్తి ఫోన్ కట్ చేశాడు. సంబంధిత ఫోన్ కాల్ పాకిస్తాన్ దేశానికి చెందిన నెంబర్‌గా ట్రూకాలర్ ద్వారా తెలుస్తోందని ఆనంద్ తెలిపారు. పక్క రాష్ట్రాల్లో విద్య, ఉద్యోగం చేస్తున్న వారి వివరాలు సేకరించి తల్లిదండ్రులకు ఇలా ఫోన్‌లు చేసి మోసం చేస్తుండడం ఇటీవల పత్రికల్లో వస్తున్నాయి. ఇలాంటి వారి మాయమాటలు నమ్మి మోసపోవద్దని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

కాయంపేటలో జెండా పండుగ



జెండాల ఊరేగింపులో గ్రామస్తులు

వడమాలపేట, జూలై 26: హిందూ, ముస్లింల ఐక్యతను చాటుతూ మత సామరస్యం వెల్లువిరిసేలా మండలంలోని కాయంపేటలో శుక్రవారం జెండా పండుగను ఘనంగా జరుపుకున్నారు. 20 సంవత్సరాల తరువాత బ్రాహ్మణపట్టులోని ముస్లిం మతపెద్దల ఆధ్వర్యంలో గ్రామస్తులు జెండా పండుగ నిర్వహించారు. గ్రామంలోని జెండామాను వద్ద తమిళనాడులోని నాగూర్, నాగపట్నం నుంచి వచ్చిన ప్రసాదాలకు పూజలు నిర్వహించారు. జెండాలను గంధం, పూలతో అలంకరించి ఊరేగించారు.

29న మార్కెట్ వేలంపాట

పుత్తూరు అర్బన్, జూలై 26: ద్రౌపదీదేవి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆగస్టు 11నుంచి 28వ తేదీ వరకు మున్సిపల్ పరిధిలో తాత్కాలికంగా ఏర్పాటు చేసుకునే దుకాణాల నుంచి గుత్త వసూలుకు వేలం పాటను 29వ తేదీ సోమవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించ నున్నట్లు కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి తెలిపారు.

గోవిందమ్మ ఆలయ పూర్వవైభవానికి కృషి

పుత్తూరు అర్బన్, జూలై 26: గేటు పుత్తూరు గ్రామదేవత గోవిందమ్మ ఆలయానికి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని మాజీ ఎంపీపీ డీఎన్ ఏలుమలై(అమ్ములు), మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ డీఎస్ గణేష్ స్పష్టం చేశారు. నగరి ఎమ్మెల్యేగా గాలి భానుప్రకాష్ అఖండ మెజార్టీతో గెలవడంతో శుక్రవారం 108 కొబ్బరికాయలు కొట్టి నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయానికి వచ్చే భక్తులకు తాగునీరు, ఇతర సౌకర్యాలను ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ దృష్టికి తీసుకువచ్చిన నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి వీడీ అశోక్, ఎంఎస్ .బాలాజీ, ఎంఎస్ శేఖర్, ఇళయారాజా, పీఎస్ రాజా, ఎంకే శంకర్, ఏజీ నటరాజన్, ఎంజి కైలాసం, గ్రామ పెద్దలు ఎంకే ఆర్ముగం, ఎంకే వేలన్, పి.కుమరన్, ఎన్‌సీ శేఖర్, ఎంఎస్ గణేశన్, ఎంవీ గోవిందన్, రాజా, సురేష్, ఎంఎస్ కృష్ణన్, అప్పస్వామి తదితరులు పాల్గొన్నారు.



గోవిందమ్మ ఆలయం వద్ద కొబ్బరికాయలు కొడుతున్న నాయకులు